www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 12 ఏప్రిల్ 2025
సంపుటి :06 సంచిక : 311 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## వందేళ్ల అవసరాలకుఅనుగుణంగా డ్రైపోర్ట్ కు రూపకల్పన చేయాలి

- రాష్ట్ర ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి
- సమావేశంలో పాల్గొన్న సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి తదితరులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 11: 2 లో..



## బీసీల ఆరాధ్యులు మహాత్మ జ్యోతిబా పూలే

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ.



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11: బడుగుల వజ్రాయుధం.. బీసీల బీసీల ఆరాధ్యులు.. గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి ఉత్సవాలను ఈ రోజు చిక్కడపల్లి లో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడిన తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సూగూరి దుర్గయ్య 2 లో..




## మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు అర్పించిన సీఎం

- అంబర్ పేట్ కార్య క్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ అంబర్‌పేటలోని మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ముఖ్యమంత్రి ,ఉప 2 లో..

## సిరిసిల్ల జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించిన మంత్రులు

### గ్రంధాలయం లో ఉండే సమస్యలను అడిగి తెలుసుకొన్న మంత్రులు పొన్నం, తుమ్మల, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు



వెలుతురు, కరీంనగర్ జిల్లా,ఏప్రిల్ 11: సిరిసిల్ల జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్ర మంత్రులు,పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు కలిసి గ్రంధాలయాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు,అలాగే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు,అందు లో 2 లో..

# ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

- సీఎం రేవంత్ రెడ్డి

### నగరంలో మెట్రో విస్తరణ పై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో సమీక్షా సమావేశం



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 11: హైదరాబాద్ మెట్రోను ఫ్యూచర్ సిటీ వరకు విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి





ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ విస్తరణకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నగరంలో మెట్రో విస్తరణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు అధికారులు వివరించారు. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (36.8 కి.మీ.), రాయదుర్గం – కోకాపేట నియోపోలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్ – పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్ – హయత్‌నగర్ (7.1 కి.మీ.) మొత్తం కలిపి 76.4 కి.మీ.ల విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసింది. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరించేందుకు కొత్తగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీరా?న్‌పేట్ వరకు పొడిగించాలని చెప్పారు. అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలని సూచించారు. హెచ్ఎండీఏ తో పాటు ఫ్యూచర్ సిటీ డెవెలప్మెంట్ అథారిటీ ని ఈ రూట్ మెట్రో విస్తరణలో భాగస్వామ్యులను చేయాలని చెప్పారు.ముఖ్యమంత్రి తో పాటు సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , శ్రీనివాసరాజు, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

- జాబ్ మేళాకి 23,238 మంది నిరుద్యోగులు హాజరు
- 5,631 మందికి వెంటనే నియామక పత్రాలు అందజేత
- 18 వేల రిజిస్టర్ చేసుకున్నారు... 9046 మంది నిరుద్యోగులు ఫైనల్ రౌండ్ కి సెలెక్ట్
- ఈ ప్రోగ్రామ్ సక్సెస్ కోసం ప్రయత్నం చేసిన అందరికీ థాంక్స్ చెప్పిన మంత్రి సురేఖ.






వరంగల్ వెలుతురు ఏప్రిల్ 11: వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్లో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్ గా ముగిసింది. ఈ జాబ్ మేళాకు ఊహించదానికంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరైనారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన 2 లో..

## సీఎం రేవంత్ కు కేసీఆర్ స్ట్రాంగ్ సపోర్ట్



- మీడియా తో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో ఏప్రిల్ 11: రేవంత్ రెడ్డి ఐదేళ్లు సిఎం గా ఉండాలని కెసిఆర్ కోరుకుంటున్నారనీ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి అన్నారు, ఎన్నడూలేని ప్రేమ కాంగ్రెస్ పై బీఆర్ఎస్ పార్టీ చూపిస్తుందనీ విమర్శించారు, చెన్నైలో డికె శివకుమార్ తో కేటీఆర్ భేటీ అయ్యారు. మద్రాసు 2 లో..

## భూభారతిని ప్రజలకు అంకితం చేస్తాం



- ఈ నెల 14న శిల్పారామం వేదికగా సీఎం చేతుల మీదుగా ఆ కార్యక్రమం నిర్వహణ
- ధరణి పేరుతో గత ప్రభుత్వం ఒక కోటి 57 లక్షల ఎకరాలను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టింది
- విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




మణుగూరు వెలుతురు ఏప్రిల్ 11: రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేసే కార్యక్రమం ఈ నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజున సాయంత్రం ఐదు గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రోజు మణుగూరులోని పినపాక శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... ఇందిరమ్మ ప్రభుత్వంలో ఏదైతే ఒక మైలురాయిగా పేదవాడికి కష్టంతో సంపాదించుకున్న భూములను భద్రత కల్పించే ఒక అద్భుతమైన భూభారతి చట్టం 2025 ని అన్ని జిల్లా కలెక్టర్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఈ సభకి ఆహ్వానించి, రాష్ట్రంలోనీ మారుమూల ప్రాంతంలో ఉండే భూములను ఆసాములకు ద్వారా మనస్ఫూర్తిగా ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ఎంతమంది, ఎన్ని శక్తులు, కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజల దీవెనలు ఉన్నంతకాలం ఈ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరని 2 లో..

## పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తున్న కాంగ్రెస్

- మహాత్మా జ్యోతిరావు పూలే కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘన నివాళి
- మహాత్ముల జయంతి, వర్ధంతిలకు నివాళి అర్పిస్తే చాలదు
- మహాత్ముల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి అసలైన నివాళి
- కాంగ్రెస్ పాలకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి
- అణిచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్ మహాత్మా జ్యాతిరావు పూలే
- దళిత, బడుగు, బలహీనవర్గాల ధైర్యం జ్యోతిరావుపూలె
- పేదల జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన మహనీయుడు
- విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయండి
- తెలంగాణలో సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా చర్యలు తీసుకోండి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ఇకనైనా ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థులను, కాలేజీలను ఆదుకోండి




హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11: "మహాత్ములకు నివాళులు అర్పించడమంటే వారి జయంతి, వర్ధంతిలను ఘనంగా నిర్వహించుకోవడమే కాదు. వారి ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడమనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి"అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలె జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రోజున హైదరాబాద్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను స్మరించుకుంటూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు... ముఖ్యాంశాలు..... అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.... బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతిరావు పూలె. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా క్రుషి చేసిన మహనీయుడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ను అభిమానించే జ్యోతిరావు పూలె కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారు. ఆరోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారు. "దీనబంధు" అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహెూన్నతుడు జ్యోతిబా పూలె. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ 2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## వందేళ్ల అవసరాలకుఅనుగుణంగా డ్రైపోర్ట్ కు రూపకల్పన చేయాలి

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సీఎం అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, RRR పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్ర వారం నాడు ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్ - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (NHAI ) పంపించాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు NHAI అంగీకరించడం లేదని అధికారులు ఈ సందర్భంగా సీఎం కు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సీఎం సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తో పాటు ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతా ధికారులు పాల్గొన్నారు.

### మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు అర్పించిన సీఎం



ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు సంబంధించి నెక్లెస్ రోడ్డు మార్గం, ఐమాక్స్ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి విగ్రహ ఏర్పాటుకు అవసమైన ప్రణాళికను అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , పీసీసీ చీఫ్,ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ , పలువురు ప్రజాప్రతినిధులు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## బీసీల ఆరాధ్యులు మహాత్మ జ్యోతిబా పూలే

గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోల శ్రీనివాస్, గౌడ సంఘాల సమన్వయ కమిటి వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, బీసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి శేఖర్ ఢిల్లీ జంతర్ మంతర్లు వేలాది మందితో బీసీల మహాగర్జన జరిపిన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం తక్షణమే భారత దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా లెక్కలలో కుల గణన చేయలని డిమాండ్ చేస్తున్నాం కేంద్రం తక్షణమే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. 42% రిజర్వేషన్లను రాష్ట్రంలో స్వేచ్ఛగా అమలు చేసుకునేందుకు 9 వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. పది సంవత్సరాల కాలంలో ఏనాడు బీసీల ఊసువేత్తని బిఆర్ఎస్ కు పూలే గురించి మాట్లాడే అర్హత లేదని, కవిత ఏనాడు మాత్మ జ్యోతిబాపూలే ప్రస్తావన చేయలేదని లిక్కర్ కుంభకోణంలో పీకలలోతు కూరుకుపోయి ఆ చర్చనుండి బయట పడే ఎత్తుగడే కోసంమే పూలే వాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నాగేశ్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేష్ గౌడ్ మరియు కోయడ హర్షవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొని పూలే కు ఘన నివాళులు అర్పించారు.

## సిరిసిల్ల జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించిన మంత్రులు

భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రంథాలయలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు, ప్రతి గ్రంథాలయం లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని విద్యా, ఉదోగ్య తదితర అంశాలపై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం వారి ఉదోగ్య శిక్షణ కార్యక్రమాలకు సహకారాన్ని అందిస్తున్నట్లు మంత్రులు పొన్నం,తుమ్మల, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు పేర్కొన్నారు, ఈ సందర్భంగా గ్రంథాలయం కు వచ్చిన విద్యార్థులు, పాఠకులను మంత్రులు పలు అంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు,గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీసి దజాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని అందరూ బాగా చదువుకోవాలని మంత్రులు వారికి సూచించారు , ఈ కార్య క్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు,

## జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

అభ్యర్థులకు నియామక పత్రాలను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందజేయడం జరిగింది. నిరుద్యోగ సమస్యను పారద్రోలడానికి ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో గాను ఉపయోగపడతాయని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల కళ్ళల్లో ఆనంద భాష్పాలతో కనిపించాయి. ఈ యొక్క జాబ్ మేళా కార్యక్రమంలో నిరుద్యోగ యువత కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా ఈ యొక్క జాబ్ మేళా సక్సెస్ కావడం జరిగింది. కాగా, ఈ జాబ్ మేళాలో మొత్తం 23,238 మంది నిరుద్యోగ యువత హాజరు కదా... 5,631 మందికి ఉద్యోగాలు లభించాయి. 18 వేల మంది రిజిస్టర్ చేసుకోగా... 9046 మంది ఉద్యోగ అభ్యర్థికి ఫైనల్ రౌండ్ కి షార్ట్ లిస్టు అయ్యారు. వీరికి మరొక పరీక్ష నిర్వహించి సెలెక్ట్ చేస్తారని ఆయా కంపెనీల నిర్వాహకులు తెలిపారు. అయితే, ఇంత సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు అయి... సంపూర్ణంగా వినియోగించుకోవడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ0 విజయవంతం కావడంకి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు చెప్పారు.

## భూభారతిని ప్రజలకు అంకితం చేస్తాం

ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ధరణి ప్రవేశ పెట్టీ ఒక కోటి 57 లక్షల ఎకరాలను విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. ధరణి మూడేళ్ల పాటు అమల్లో ఉన్న రూల్స్ ను రూపొందించలేదని.... కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన భూభారతి చట్టానికి చట్టం రూపొందించిన అనతి కాలంలోనే రూల్స్ ను రూపొందించమని తెలిపారు. దీని ద్వారా చిన్న సమస్య కూడా క్షణాల్లో ప్రకారం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్,పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ కు కేసీఆర్ స్ట్రాంగ్ సపోర్ట్

ఒప్పందం చేసుకున్నారనీ ఆయన చెప్పారు, ఫోన్ ట్యాపింగ్ కేసు, ఈ కార్ రేసింగ్, ధరణి మీద కేసు ముందుకు వెళ్లకపోవడం వీటన్నింటికి కారణం మద్రాసు ఒప్పందం అని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు, బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరికి ఒకరు గా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనీ మండిపడ్డారు , HCU భూములపై లోన్ తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం ,భూములు అమ్మడానికి ప్రయత్నం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం ,బీజేపీ పై బట్టకాల్చి మీద వేస్తున్నారనీ విమర్శించారు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడటం కోసం బీజేపీ ఎంపీ అంటూ మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు, కేటీఆర్ ను బీజేపీ ఎంపీ పేరు చెప్పకుండా అడ్డుకున్నది ఎవరు ? అంటూ మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు , గెలిచిన వంద రోజుల్లో జైల్లో వేస్తా అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పద్నాలుగు నెలలు దాటుతున్న ఇంత వరకు ఎందుకు చర్యలు లేవు అంటూ మండి పడ్డారు, మద్రాసు ఒప్పందం మేరకు బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ కు తోక పార్టీగా మారిందనీ విమర్శించారు, నిజంగా ఆధారాలుంటే బీజేపీ ఎంపీ పేరు చెప్పండి అంటూ ఆయన డిమాండ్ చేశారు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మేరకే బీజేపీ ని బద్నాం చేస్తున్నారనీ మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు, కేసుల నుంచి మాఫీ కోసం అరెస్టులను ఆపడం కోసం మద్రాసు ఒప్పందం మేరకు కేటీఆర్ సుపారీ తీసుకొని బీజేపీ పై ఆరోపణలు చేస్తున్నారు, కేటీఆర్ అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఎందుకు అరెస్ట్ లు చేయడం లేదనీ ప్రశ్నించారు, కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి బాడీ గార్డుగా మారిన కేటీఆర్ అని ఏలేటి విమర్శించారు దబీఆర్ఎస్ పార్టీ కనుమరుగయ్యే దశలో ఉందనీ మహేశ్వర్ రెడ్డి అన్నారు ,కాంగ్రెస్ బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి బీజేపీ నీ ఆపే కుట్రలు చేస్తున్నారనీ విమర్శించారు, కేటీఆర్ కూడా జై శ్రీరామ్ అనాల్సిన పరిస్థితి వచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ , ఎంఐఎం మూడు పార్టీలు కలిసిన ముప్పై సీట్లు కూడా గెలవరనీ ఆయన చెప్పారు ,48 గంటల్లో బీజేపీ ఎంపీ పేరు చెప్తా అని హడావిడి చేశారు.. ఏమైంది ? ఎందుకు పేరు చెప్పలేదు ? అంటూ మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు ,అలాగే తాను చెప్పాని పరిస్థితి లో ఉన్న తాము వదలే ప్రసక్తే లేదన్నారు,

# పూలే ఆశయాలకు తూట్లు పొడుస్తున్న కాంగ్రెస్

అంబేద్కర్ పూలెను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుంది. సతీమణి సావిత్రీబాయి పూలెతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఆనాడే ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావుపూలె. స్వాతంత్ర్యంరాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు చేసిన క్రుషి చిరస్మరణీయం.
మన దుర(దృష్టమేమిటంటే జ్యోతిరావు పూలే ఆశయాలకు విరుద్ధంగా తెలంగాణలో పాలన సాగుతోంది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉంటే నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలనా పుణ్యమా అని రాష్ట్రాన్ని నిండా అప్పుల్లో ముంచారు. ప్రజలు బిచ్చమెత్తుకునే దుస్థితికి తీసుకొచ్చారు.
స్వాతంత్ర్యానికి పూర్వమే పూలే మహానుభావుడు అక్షర వెలుగులు నింపితే... కానీ మన తెలంగాణలో అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా వెనక్కు నెట్టేశారు. ఇయాళ తెలంగాణలో నూటికి 34 మంది ఇంకా చదువుకు నోచుకోని వాళ్లున్నారు. ఇగ మహిళల సంగతి చెప్పనక్కర్లేదు. నూటికి 40 మందికిపైగా చదువుకు దూరంగా ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దళిత, బడుగు బలహీనర్గాల పేదలకు విద్య, వైద్యం అందకుండా పోయే పరిస్థితి దాపురించింది. ఏళ్ల తరబడి ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమైతున్నారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగా వేలాది కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో అటు విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ప్రైవేటు కాలేజీలు మూసివేసుకునే దౌర్భాగ్య స్థితి ఏర్పడినా పట్టించుకోని దౌర్భాగ్య పాలన కొనసాగుతోంది.
అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే చదువుకునే ప్రతి విద్యార్థికి 5 లక్షల రూపాయల భరోసా కార్డు ఇస్తామని, ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ వాటిని గాలికొదిలేసింది. 6 గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను నట్టేట ముంచింది.
మహాత్ములకు నివాళులు అర్పించడమంటే వారి జయంతి, వర్ధంతిలను ఘనంగా నిర్వహించుకోవడం కాదు. వారి ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చడమే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి. దళిత, బహుజన, అగ్రవర్ణ పేదల జీవితాల్లో అక్షర వెలుగులు నింపేందుకు, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలన్నీ చెల్లించి విద్యార్థుల ఉన్నత చదువులకు ఢోకా లేకుండా చర్యలు తీసుకోవాలి. అట్లాగే వంద శాతం అక్షరాస్యత దిశగా క్రుషి చేయాలి. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.

# పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన కెసిఆర్ కుటుంబం

- ఫార్ములా రేస్ కేసులో కెటిఆర్ అరెస్ట్ కాక తప్పదు
- కెసిఆర్ కుటుంబ దోపిడీపై సిబిఐ విచారణ జరపాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):
ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దోపిడీని భరించ లేకనే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు గెలిపించారన్నారు. గత పదేండ్లలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్యముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ఈ మాటలను నమ్మకండంటూ తెలంగాణ ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్



ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని పేర్కొన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. సగం సగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఎన్నివేల ఎకరాలను కొల్లగొట్టారో తెలియదా? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.రైతులు బాగు పడుతుంటే కేటీఆర్‌కి కడుపు నొప్పి వస్తోందని ఎద్దేవా చేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా? అంటూ బీఆర్ఎస్ నేతలు సూటిగా ప్రశ్నించారు.

## బిఆర్ఎస్ సభకు అనుమతిపై 17లోగా తేల్చండి

- ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):




హనుమకొండలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభకు అనుమతులపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. హనుమకొండలో సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా.. శుక్రవారం విచారణ జరిగింది. ఆ సభకు అనుమతిపై పరిశీలిస్తున్నామని కోర్టుకు జీపీ తెలిపారు. వారం రోజుల్లో వరంగల్ సభ అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. సభ కోసం బీఆర్ఎస్ పెట్టుకున్న పర్మిషన్‌ను అనుమతించకపోవడం, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లే హైకోర్టులో పిటిషన్ వేసినట్లు బీఆర్ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే 17 లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 21 కి వాయిదా వేసింది. అలాగే వరంగల్ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా.. ఈనెల 27న హనుమకొండలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది వరకు సభ నిర్వహిస్తామని గులాబీ పార్టీ పేర్కొంది. అయితే అందుకు పోలీసుల అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. 17లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలంటూ విచారణను వాయిదా వేసింది.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు

- ఆర్థిక నేరానికి తెరలేపిన రేవంత్ ప్రభుత్వం
- 400 ఎకరాలు పక్కాగా అటవీ భూములే
- దానిపై రుణాలు ఎలా తెచ్చరో చెప్పాలి
- దీనిపై సిబిఐ విచారణ జరగాల్సిందే
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ డిమాండ్

హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగు తున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని




మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారథ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచితి లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ-జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ తాకట్టు- పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు- అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు- అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీ-జీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటేనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటిగేషన్ భూమికి ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# హైదర్ గూడ లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే198వ జయంతి కార్యక్రమం

- మహాత్మా జ్యోతిరావు పూలే198వ జయంతి సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే, మాత సావిత్రి భాయి పూలే గార్ల విగ్రహాల ఆవిష్కరణ



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ గారి చేతుల మీదుగా ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ హైదర్ గూడ చౌరస్తా హైదరాబాద్ లో మహాత్మా జ్యోతి రావు పూలే మాత సావిత్రి భాయి పూలే విగ్రహాలు ఆవిష్కరణ చేశారు, విగ్రహాల దాత ఆళ్ల రామకృష్ణ గారికి, రామన్ గౌడ్ గారికి మేకపోతుల నరేందర్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్బంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ మహనీయులు సామాజిక మార్పుకోసం బీసీలు, ఎస్సిలు, ఎస్టిలు, మహిళ లలు సాధికారిత కొరకు వారు ఇరువురు పుణ్య దంపతులు హహర్నిశలు పాటు పడ్డారు వారికి శుక్రవారం రోజున మేము ఘనమైన నివాళులు అందించాము,మతోపాటుగా సహకారం అందించిన ,క్రిస్టోఫర్ గౌడ్, రామారావు బీసీ ఉద్యోగుల సంఘం,నవీన్ రాజు,ఎర్ర శ్రీహరి గౌడ్, సరికొండ రామకృష్ణంరాజు కార్య నిర్వాహక అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం శివకుమార్, గిరగాని భిక్షపతి గౌడ్, కలల్ నర్సింలు గౌడ్, ఆనంతుల ప్రసాద్ గౌడ్, రవికుమార్ యాదవ్, ఉపేందర్గొత్త వినయ్ బాబు, అక్షిత్ జైస్వాల్ ,విశ్వ పతి తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు..



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
మహాత్మ జ్యోతిరావు పూలే 199 వ జయంతి సందర్భంగా నేడు సెక్రటేరియట్ నెక్లెస్ రోడ్డులో రెండు ఎకరాల స్థలం లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు కు స్వయాన ముఖ్యమంత్రి స్థలం పరిశీలన చేయడం హర్షించ దగ్గ విషయం, గత ప్రభుత్వం లో ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ 10 ఏండ్ల పాలనలో ఏనాడు మహాత్మ జ్యోతిరావు పూలే కు జయంతి వర్ధంతి కి నివాళులు కూడా అర్పించని ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రగతి భవన్ కు మహాత్మ జ్యోతిరావు పూలే పేరు పెట్టడం, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడం,42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో తీర్మానం చేయడం, డిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నాకు మద్దతు తెలుపడం మహనీయులను గుర్తించి విగ్రహాలకు వెంటనే ఆమోదం తెలుపడం తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుచున్నాం ఎస్. దుర్గయ్య గౌడ్ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షుడు, ఈ విగ్రహానికి సహకరించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గారికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ గౌడ్ గారికి, ప్రత్యేక కృతజ్ఞతలు.

# జ్యోతిరావు పూలే చేసిన కృషి మరువలేనిది

- ఎమ్మెల్యే పాయల శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
జ్యోతిరావు పూలే చేసిన కృషి మరువలేనిదని వివక్షలేని సమాజం కావాలనే ఆయన ఆశయాలను మనందరం పాటించాల్సిన అవసరం ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు చదువుతోనే సామాజిక అభివృద్ధి జరుగుతుందని భావించిన ఆయన ఆ రోజుల్లోనే విద్యాభివృద్ధికి కృషి చేశారని ఆయన అన్నారు ఆయన ఆశయాలకు అనుగుణంగా సామాజికంగా అన్ని వర్గాలు అభివృద్ధి చెందేందుకు పాటుపడాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు బిసి సంఘాల నాయకులు భారతీయ జనతా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 2వేల కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):**
గడచిన ఆర్థిక సంవత్సరంలో జిహెచ్ఎంసిలో 2వేలకోట్లు పన్ను వసూళ్లు జరిగాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 3వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని కమిషనర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో ప్రతి రూపాయికి న్యాయం చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల కోసమే ఆ ఆదాయాన్ని ఖర్చు చేస్తామని చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో గ్రేటర్‌లో రూ. 2వేల కోట్లకుపైగా ఆస్తి పన్ను వసూలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కమిషనర్.. ఆస్తి పన్ను విభాగంలోని అధికారులు, సిబ్బందిని సత్కరించారు. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రెవెన్యూ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లను అభినందిస్తూ ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆస్తి పన్ను చెల్లించిన నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను ఆరు నెలల్లో ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాలని నిర్ణయించాం. నగరంలో చేపట్టిన జీఐఎస్ సర్వే ద్వారా 9 లక్షల ఆస్తుల సర్వే పూర్తయింది. దాని వల్ల ఆస్తి పన్ను వసూళ్లు మరింత పెరగొచ్చున్నారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే

- దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి.
- మహిళా విద్యకు ఆధ్యుడు పూలే సంగారెడ్డిలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు.

**సంగారెడ్డి వెలుతురు ఏప్రిల్ 11:**
అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి నీ పురస్కరించుకొని సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి టీజీఐఐసీ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ లతో కలిసి పూలమాలలు వేసి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మహాత్మ జ్యోతిబాపూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం ఇచ్చిన మహా నాయకుడు అన్నారు. ఆయన ఆడపిల్లల చదువు కోసం తన జీవితాన్ని



అంకితం చేశాడన్నారు. సత్యశోధక సమాజం ద్వారా నిరుపేదలకు వివాహాలు జరిపించాడన్నారు. ఎన్నో పాఠశాలలు వసతి గృహాల ద్వారా అనేకమంది విద్యార్థులు జీవితాల్లో వెలుగును నింపిన మహనీయుడు అన్నారు మహిళా విద్యకు ఆంధ్రుడు పూలే అన్నారు ఆయన చూపిన మార్గమే ఈనాటి అభివృద్ధికి మూలాధారంగా నిలుస్తుంది అన్నారు. సత్యమేవ జయతే నినాదంతో సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు ,కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'నేరెళ్ల' ఘటనపై ఎస్సీ కమిషన్ నే తప్పుపడతారా?

- తక్షణమే ఆ దుష్ప్రచారాన్ని నిలిపేయండి
- లేనిపక్షంలో చర్యలు తప్పవు
- జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక
- నాటి ఘటనపై తీసుకున్న చర్యలను వివరించిన ఎస్సీ కమిషన్
- ప్రభుత్వానికి పంపిన ఎస్సీ కమిషన్ మధ్యంతర నివేదిక విడుదల
- బాధితులకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం
- సంబంధిత పోలీసులను సస్పెండ్ చేయాలని హుకుం




**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
సరిగ్గా 8 ఏళ్ల క్రితం (2017లో) రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 'నేరెళ్ల' ఘటనలో కొంతమంది సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్ ను బదనాం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఆ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పనిచేసే ఎస్సీ కమిషన్ ను నిందించడాన్ని ఆయన తప్పుపట్టారు. తక్షణమే ఆ దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతోపాటు ప్రభుత్వానికి పంపిన మధ్యంతర నివేదికను సైతం మీడియాకు విడుదల చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తూ ఆ నివేదికను రూపొందించిన అంశాన్ని గుర్తు చేశారు. ఆ నివేదికలో జాతీయ కమిషన్ పేర్కొన్న వాటిలోని ముఖ్యాంశాలు....

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల గ్రామంలో 2017 జులై లో దళితులపైన, ఇతరులపైన జరిగిన దాడి, వేధింపుల ఘటనలో జాతీయ ఎస్సీ కమిషన్ ప్రతిష్టను దిగజార్చే విధంగా కొంత మంది వ్యక్తులు మాట్లాడుతున్నట్లు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి వచ్చింది. మెజిస్టీరియల్ అధికారులున్న ఎస్సీ కమిషన్ దళితులపై జరిగే దాడులు, వేధింపులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంలో అగ్రభాగాన ఉంది.

2017 జులై లో నేరెళ్ల గ్రామంలో జరిగిన ఘటనపై స్వయంగా ఎస్సీ కమిషన్ ఆ గ్రామంలో పర్యటించింది. బహిరంగ విచారణ జరిపింది. ఈ విషయం అక్కడి ప్రజలకు, అధికారులకు, పోలీస్ సిబ్బందికి తెలుసు. ఆ విచారణ జరిగిన వెంటనే ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరెళ్ల బాధితులను కలిసి స్టేట్ మెంట్ రికార్డు చేయడం కూడా జరిగింది. తదుపరి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులను విచారణకు పిలిచి వారి స్టేట్ మెంట్ ను కూడా రికార్డ్ చేయడం జరిగింది. అనంతరం అదే ఏడాది ఆగస్టు 7న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికను పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది. ఈ విషయం కూడా మీడియాలో వచ్చింది. ఆగస్టు 7, 2017న ఫైల్ నెం 3/33/17టీఎస్ ఆర్ యూ పేరుతో పంపిన ఆ మధ్యంతర నివేదికలో ప్రధానంగా ఈ క్రింది 5 అంశాలను ప్రస్తావిస్తూ చర్యలకు ఆదేశించింది...

1. ఈ ఘటనపై హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరపాలి.
2. నేరెళ్ల ఘటనపై విచారణ సాఫీగా జరగాలంటే సిరిసిల్ల జిల్లా ఎస్పీని బదిలీ చేయాలి. ఆ జ్యూరిడిక్షన్ పరిధిలో ఉండకూడదు.
3. సంబంధిత డీఎస్పీ, సీఐ, ఎస్ఐ లను విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలి.
4. బాధితులకు పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. చికిత్స అందించాలి.
5. బాధితులకు రూ. 5 లక్షల పరిహారం అందించాలి.

# సిద్ధిపేట జిల్లా లో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రులు

- రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుంది
- మంత్రులు పొన్నం, తుమ్మల నాగేశ్వర్ రావు లు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 11:**
సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం వెంకటాపూర్ లో గత రాత్రి కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,పొన్నం ప్రభాకర్ లు ఈ సందర్భంగా వారు మాట్లాడారు దెబ్బతిన్న వరి,మామిడి ,బీర కూరగాయల పంటలను పరిశీలించిన పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ



రాష్ట్రంలో అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు ఈ సందర్భంగా మంత్రులు దెబ్బతిన్న పంటలను ఫీల్డ్ విజిట్ చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు, రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని తెలిపారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రులు తెలిపారు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు,సీఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అన్నారు, రైతుల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి ఎప్పటి కప్పుడు ప్రభుత్వ అధికారులతో సమీక్షలను నిర్వహించి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారనీ వారు తెలిపారు,

# ఏడాది చివరికల్లా అన్ని హాస్పిటళ్లు, కాలేజీల నిర్మాణ పనులను పూర్తి పూర్తిచేయాలి

*మెడికల్ కాలేజీలు, కొత్తపేట్, సనత్‌నగర్, అల్వాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు,*

*వరంగల్ హెల్త్ సిటీ భవన నిర్మాణ పనులపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష చేశారు.*

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, ఆరోగ్యశ్రీ సీఈవో ఆర్వి కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, కాళోజి హెల్త్ యూనివర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, డాక్టర్లు



పాల్గొన్నారు. మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ఈ ఏడాది చివరికల్లా అన్ని హాస్పిటళ్లు, కాలేజీల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షకాలం మొదలయ్యేలోగా నిర్మాణ పనులన్నీ కొలిక్కి రావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల ప్రకారం వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే, హాస్పిటళ్లలో వైద్య సేవలు ప్రారంభించడానికి సిద్ధంగా



ఉండాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ, కొత్తపేట్, అల్వాల్, సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అల్వాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో సైన్సెస్‌గా, సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ సైన్సెస్‌గా, కొత్తపేట సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ గ్యాస్ట్రో సైన్సెస్‌గా అభివృద్ధి చేయబోతున్నామని మంత్రి వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు.



# ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థుల 174వ స్నాతకోత్సవంలో పాల్గొని, విద్యార్థులకు పట్టాలు అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ.

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
ఈరోజు మీ అందరి జీవితంలో మర్చిపోలేని సంతోషకరమైన రోజు. మెడిసిన్ పూర్తి చేసుకుని, మీకు ఇష్టమైన వైద్య రంగంలోకి అడుగు పెడుతున్న మీకందరికి అభినందనలు. ఈ జర్నీలో మీకు మద్దతుగా నిలిచి, మిమ్మల్ని తీర్చిదిద్దిన మీ తల్లిదండ్రులకు, ఉస్మానియా ప్రొఫెసర్లకు శుభాకాంక్షలు. ఉస్మానియా కాలేజీ, హాస్పిటల్ వరల్డ్ ఫేమస్. కోట్ల మంది పేషెంట్ల ఆశాదీపం. ఇక్కడ చదివిన మీరంతా అదృష్టవంతులు. మీకంటే ముందు ఇక్కడ చదివిన ఎంతోమంది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ హాస్పిటల్స్‌ను లీడ్ చేస్తున్నారు. మీరు కూడా ఉన్నతస్థాయికి ఎదగాలి. మిగిలిన రంగాలకంటే, మీ ప్రొఫెషన్ భిన్నమైనది. నిత్యం ఇతరుల ప్రాణాలు కాపాడే అవకాశం, ఇతరుల బాధను, నొప్పిని తొలగించే అవకాశం మీకు మాత్రమే ఉన్నది. మీరంతా మీ ప్రొఫెషన్‌లో పేదల పక్షాన నిలవాలి. ప్రతి ఒక్కరికీ గొప్పగా బతకాలనే కలలు ఉంటాయి. కానీ, ఆ కలను నెరవేర్చుకోవడానికి ఇతరుల కలలను పణంగా పెట్టొద్దు. సామాన్యులను దోచుకోవద్దు. సర్వీస్ ఓరియెంటెడ్‌గా ఉండాలి. వైద్యో నారాణయ హరి అని మీ పేషెంట్లతో అనిపించుకోవాలి. ఒకరికి సాయం చేయడంలో, ఒకరి ప్రాణం కాపాడడంలో ఉండే సంతృప్తి, సంతోషం ఎలా ఉంటుందో, మీ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మీరు ఇప్పటికే అనుభవించి ఉంటారు. ఇకపై కూడా మీరు అదే విధంగా ముందుకు సాగాలి. మీ పేషెంట్ల ఆరోగ్యంతో పాటు, మీ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి. విద్య, వైద్య రంగాలకు కాంగ్రెస్ మా ప్రభుత్వాలు మొదటి నుంచి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాయి. దశాబ్దాల ఉస్మానియా నూతన హాస్పిటల్ ఆకాంక్షను నెరవేరుస్తున్నాం. గోషామహల్‌లో 2700 కోట్లతో కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మిస్తున్నాం. ఉస్మానియా, గాంధీ మెడికోల కోసం 210 కోట్లతో అత్యాధునిక వసతులతో హాస్టల్స్ నిర్మిస్తున్నాం. మీరంతా స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసి, మంచి డాక్టర్లుగా ఎదగాలని ఆశీర్వదిస్తూ.. మీ అందరికీ మరోసారి శుభకాంక్షలు.



# సంపాదకీయం..

## కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్‌ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు- అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్‌ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్‌ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్‌ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందించాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అతడు 2020 కొవిడ్ సమయంలో విడుదలయ్యాడు. ఆ మర్నాడే అతడిని అరెస్టు చేయడానికి నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు అమెరికా వారెంటు కోరింది. దాదాపు ఐదేళ్లు వివిధ దశల్లో జరిపిన న్యాయపోరాటం తర్వాత అతడు విచారణను ఎదుర్కోవడానికి భారత్‌కు తీసుకొచ్చారు.మొత్తంగా ఎన్‌ఐఎ చేసిన కృషి సాహసోపేత మైనదని చెప్పాలి. ఇది ఓ అరకంగా అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను పెంచేదే. రాణ నోరు మెదిపితేనే విషయాలు, వివరాలు బయటకు వస్తాయి. అప్పుడే మనకు విజయం దక్కుతుంది.

# తహవ్వుర్ హుస్సేన్ రాణాను అప్పగించడం

- మోడీ దౌత్య విజయానికి ప్రతీక
- ప్రశంసలు కురిపిస్తున్న నెటిజన్లు



**న్యూఢిల్లీ,ఏప్రిల్11( వెలుతురు):**

ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను ఎట్టకేలకు భారత్‌కు తీసుకుని రావడం ఓ రకంగా భారత్ దౌత్య విజయంగా చెప్పుకోవాలి. వివిధ దేశాలతో దౌత్యపరంగా అనుసరిస్తున్న వ్యవహారాలను గమనించినప్పుడు రాణాను అమెరికా అప్పగించడం అన్నది ఓ రకంగా మోడీ దౌత్య విజయంగానే చూడాలి. అలాగే ఎన్‌ఐఎ చేసిన కృషి కూడా తక్కువేం కాదు. ఈ కారణంగానే రాణను అమెరికా అప్పగించడంతో భారత్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడు ఎన్‌ఐఏ కస్టడీలో ఉన్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో తహవ్వుర్ రాణా కేసుకు సంబంధించి గతంలో ప్రధాని మోదీ చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 14 ఏళ్ల క్రితం చేసిన ఆ పోస్ట్‌లో రాణా కేసును ఉద్దేశిస్తూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ దౌత్య విధానాలను మోదీ తీవ్రంగా విమర్శించారు. 2011లో ఈ కేసుపై అమెరికా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ముంబయి దాడుల్లో రాణా ప్రత్యక్ష పాత్ర లేదని తేల్చింది. అయితే, ఆ ఘటనకు కారణమైన ఉగ్ర సంస్థకు అండగా నిలిచాడన్న అభియోగాలపై అతడిని దోషిగా తేల్చింది. ఈ తీర్పుపై 2011 జూన్ 10న ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. ముంబయి దాడుల ఘటనలో తహవ్వుర్ రాణాను అమాయకుడని యూఎస్ ప్రకటించడం.. భారత సార్వభౌమత్వాన్ని అవమానించడమే. మన దేశ విదేశాంగ విధానానికి ఇది భారీ ఎదురుదెబ్బ అని మోదీ ఆనాటి పోస్ట్‌లో రాసుకొచ్చారు. అప్పుడాయన గుజరాత్ సిఎంగా ఉన్నారు. ప్రస్తుతం రాణా అప్పగింత నేపథ్యంలో ఈ పోస్ట్‌ను నెటిజన్లు షేర్ చేస్తూ.. ప్రధాని దౌత్య విధానాలను కొనియాడుతున్నారు. తహవ్వుర్ రాణాను తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం భారీ విజయాన్ని సాధించిందని ప్రశంసిస్తున్నారు. ఇకపోతే రాణా అప్పగింతపై అమెరికా స్పందించింది. ఉగ్రదాడుల బాధ్యులకు తగిన శిక్ష పడేలా భారత్ చేస్తున్న ప్రతి పనికి సుదీర్ఘకాలంగా అమెరికా మద్దతు అందిస్తూ వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెను సమస్యగా మారిన ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఈ రెండు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఆ నిబద్ధతను చాటిచెబుతూ తహవ్వుర్ రాణాను అప్పగించాం అని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టమ్మీ బ్రూస్ వెల్లడించారు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నుంచి తహవ్వుర్ రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రత్యేక విమానంలో గురువారం దిల్లీకి తీసుకొచ్చారు. అనంతరం పటియాల హౌస్ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై కోర్టు విచారణ జరిపి రాణాను 18 రోజుల ఎన్‌ఐఏ కస్టడీకి అప్పగించింది. ఇప్పుడు కస్టడీలో రాణాను ప్రశ్నించడం ద్వారా వివరాలు రాబట్టనున్నారు. ప్రధాని మోదీ ఫిబ్రవరిలో అమెరికా వెళ్లినప్పుడే రాణా అప్పగింతకు మార్గం సుగమమైంది. 14న మోదీతో జరిగిన సమావేశానంతరం సంయుక్త మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. భారత్, అమెరికాల మధ్య నేరస్థుల అప్పగింత ఒప్పందం ఉండటంతో రాణాను అగ్రరాజ్యం కస్టడీలో ఉంచింది. అతడి అప్పగింతపై అన్ని కోర్టుల్లో ఎన్‌ఐఏ విజయం సాధించడంతో తరలింపు సాకారమైంది. రాణాను భారత్‌కు అప్పగించాలని 2023 మే 16వ తేదీన సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఆదేశాలిచ్చింది. దానిని నైన్త్ సర్క్యూట్ కోర్టులో పలు లిటిగేషన్లద్వారా అతడు సవాలు చేశాడు. వాటన్నింటినీ కోర్టు తిరస్కరించింది. అనంతరం రిట్ ఆఫ్ సర్టియోరరితోపాటు హెబియస్ పిటిషన్లను, అత్యవసర అప్పీళ్లను యూఎస్ సుప్రీంకోర్టులో రాణా దాఖలు చేశాడు. వాటిని సుప్రీంకోర్టు ఇటీవల తిరస్కరించడంతో అతడి అప్పగింతకు మార్గం సుగమమైంది. రెండు దేశాల మధ్య ఒప్పందం కారణంగా భారత్ సరెండర్ వారెంట్‌ను పొందడంతో రాణాను తరలించడం ప్రారంభమైంది. చివరకు అతడిని భారత్‌కు తీసుకొచ్చి భారత్ భారీ విజయం సాధించింది. తహవ్వుర్ రాణాను దేశానికి తీసుకు రావడాన్ని అతి పెద్ద దౌత్య విజయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య నైపుణ్యాన్ని, న్యాయంపై నిబద్ధతను తెలియజేస్తుందని షా పేర్కొన్నారు. అయితే రాణా అప్పగింత ప్రక్రియను యూపీఏ హయాంలో ప్రారంభించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కానీ మోడీ విదేశాంగ విధానంపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ఇప్పుడు సమాధానం చెప్పాలి.

# యూపిలో భారీ వర్షాలతో అతలాకుతలం

- 22మంది మృతి చెందినట్లు వెల్లడి
- సాయం ప్రకటించిన సిఎం యోగి



**లక్నో,ఏప్రిల్11( వెలుతురు):**


ఉత్తరప్రదేశ్‌లో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల కనీసం 22 మంది అయినా మృతి చెందారు. ఇక ఈ వర్షాల దెబ్బకు 15 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 45 జంతువులు చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఈ సందర్భంగా మృతులకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు పరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ పోస్టులో వెల్లడించారు. కాగా, శుక్రవారం కూడా ఉత్తరప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ప్రాంతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. లక్నో, వారణాసి, అయోధ్య, చందౌలీ, బారాబంకి, శ్రావస్తి, బలరామ్‌పూర్, మహారాజ్‌గంజ్, సిద్ధార్థ నగర్, ఖుషీనగర్, గోండా, బస్తీ, గోరఖ్‌పూర్, డియోరియా, ఉన్నావ్, ప్రతాప్‌గఢ్, అమేథి, సుల్తాన్‌పూర్, జౌన్‌పూర్, అంబేద్కర్ నగర్, సన్త్‌బీర్ నగర్, సుల్తాన్‌పూర్, ఎస్.ఘాజీపూర్ వంటి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనావేసింది. బీహార్‌లో ఉరుములు, మెరుపుల వర్షం వల్ల 21 మంది మృతి చెందారు. ఒకరు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఈ వర్షాల వల్ల ఇళ్లు కూలిపోయాయి. పశువులు మృతి చెందాయి. భారీగా పంట నష్టం జరిగింది. ఈ ఘటనలో మృతులకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు పరిహారాన్ని ప్రకటించారు.

# గోవధ శాలగా మారిన ఎస్వీ గోశాల

- ఈ పాపం టిటిడితో పాటు కూటమి ప్రభుత్వానిదే
- మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు

**తిరుపతి,ఏప్రిల్11( వెలుతురు):**

ఎస్వీ గోశాల గోవధ శాలగా మారింది.. ఇది సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన పాపమే అంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలోమీడియాతో మాట్లాడిన ఆయన.. గోవులు దేవుళ్లతో సమానం.. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో గోవులు దారుణంగా చనిపోతున్నాయి.. వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైనది గోమాత.. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయం అంటున్న ఎన్డీఏ ప్రభుత్వంలో వందకు పైగా గోవులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.. టిటిడి అధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ గోశాలలో గత మూడు నెలలుగా వందకుపైగా ఆవులు చనిపోతున్నా.. పట్టించుకోకుండా ఉన్నారు.. ఎస్వీ గోశాలలో గోవులను దుస్థితి దారుణంగా ఉంది. వందకు పైగా ఆవులు చనిపోయాయి.. ఆ లెక్కలు, ఆవుల మృతి బయటకు రాకుండా చూశారు.. కనీసం పోస్టు మార్టం లేకుండా గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఈ మహాపాపం టిటిడిది, ప్రభుత్వానిది కాదా అని నిలదీశారు. గోశాలపై పర్యవేక్షణలో అధికారి లేకపోవడం తోనే ఈ దుస్థితికి కారణం అన్నారు కరుణాకర్‌రెడ్డి.. గోవుల మరణాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన ఆయన.. ఎస్వీ గోశాల నుండి తిరుమలకు పాలు వెళ్తాయి.. స్వామి వారికి నైవేద్యంగా వెన్న ఇక్కడ నుండి ఇస్తారు.. వైసీపీ పాలనలో గుజరాత్, రాజస్థాన్ సహా ఇతర రాష్ట్రాల నుండి ఆవులను తీసుకోచ్చి స్వామి వారి సేవలు అందించాం.. 580 ఆవులను మా ప్రభుత్వంలో తీసుకొచ్చాం... వైసిపి పాలనలో 1500 లీటర్ల పాలు తిరుమలకు రోజు అందించాం.. ఇప్పుడు కూటమీ ప్రభుత్వం ఐదు వందల లీటర్ల పాలు తిరుమలకు వెళ్లడం లేదని విమర్శించారు.. అయితే, పవన్ కల్యాణ్, చంద్రబాబు.. జగన్ పై అసత్య ప్రచారం చేశారు.. కానీ, హిందు ధర్మాన్ని కాపాడింది జగన్.. కూటమీ ప్రభుత్వం టిటిడి ఎస్వీ గోశాలనే రక్షించలేకపోయారు.. అక్కడి అధికారుల నిర్లక్ష్యంతోనే గోవులను చనిపోయాయి... ఇప్పటి వరకు టీ-టీ-డీ జేఈవో, సీవీ ఎస్వీ సహా ఇతర అధికారులను నియమించలేదు... తొక్కిసలాట ఘటనలో ఏమాత్రం సంబంధం లేని ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి కావాలనే సస్పెండ్ చేసి.. ఇప్పుడు గోవుల మృతికి చంద్రబాబు కారణం అయ్యారని దుయ్యబట్టారు..






# నేడు హనుమత్ జయంతి

## కొండగట్టులో ప్రత్యేక పూజలు

**జగిత్యాల,ఏప్రిల్11( వెలుతురు):**

శ్రీ రాముని భక్తుడైన హనుమంతుడిని పూజిస్తూ హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకుంటారు. హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండగలలో ఒకటి ఇది.ఏప్రిల్ 12వ తేదీ శనివారం హనుమాన్ జయంతిని ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడానికి భక్తులు సిద్ధం అవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండట్టులో హనుమత్జయంతిని ఘనంగా నిర్వహిస్తారు. దీక్షాపరులు ఇప్పటికే కొండట్టుకు చేరుకున్నారు. ఈ రోజు తన అసమానమైన శారీరక బలం, అచంచలమైన భక్తి , నిస్వార్థ సేవకు ప్రసిద్ధి చెందిన హనుమంతుడి జన్మదినోత్సవం. కేసరి అంజన దేవిల తనయుడు ఆంజనేయుడు. హనుమంతుడు కేసరి అని కూడా పిలుస్తారు. ఆంజనేయస్వామి ధైర్యం, నిస్వార్థ సేవ అంకితభావానికి ప్రతీక. మన దేశంలోని హిందువులు మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఈ రోజును హనుమతుండిని అత్యంత భక్తిశ్రద్దలతో పూజిస్తారు. ఈ రోజున భక్తులు బజరంగ బలి ఆశీర్వాదం కోసం రామలయలను, హనుమంతుడి ఆలయాలను సందర్శిస్తారు. ఉపవాసం ఉంటారు. హనుమాన్ చాలీసాను జపిస్తారు. అయితే ఈ ఆధ్యాత్మిక వేడుకను జరుపుకోవడానికి అనుసరించాల్సిన నిర్దిష్ట సంప్రదాయాలు, నిబంధనలు ఉన్నాయి. అలాగే నివారించాల్సిన పద్ధతులు కూడా ఉన్నాయి. దృక్ పంచాంగం ప్రకారం చైత్ర మాసం పౌర్ణమి తిథి శనివారం, ఏప్రిల్ 12వ తేదీ హనుమంతుడి జయంతిని పౌర్ణమి రోజు జరుపుకోనున్నారు. హిందూ మతంలో ముఖ్యమైన పంగడ కనుక చాలా మంది ఈ రోజు ఉపవాసం ఉంటారు. హనుమంతుడిని అత్యంత భక్తిశ్రద్దలతో పుజిస్తారు.

## తంగడపల్లిలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 11 :**
మున్సిపాలిటీ పరిధి తంగడిపల్లి లో అంబేద్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ అంటరానితనం కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు, సమాజంలో సగమైన మహిళలకు సమాన హక్కులు కల్పించాలని గళమెత్తిన యుగ పురుషుడు, సామాజిక అంతరాలపై తన కలంతో గులాంగిరి ద్వారా యుద్ధశంఖం పూరించిన యోధుడు మహాత్మా జ్యోతిబా పూలే అని కొనియాడారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గ్యార కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉబ్బు వెంకటయ్య, మాజీ వార్డ్ మెంబర్ ఉదరియాదయ్య , గడ్డం రాజరత్నం, బొజ్జ వెంకటేశం, ఉదర్ బాబురావు, ఇప్ప వెంకటేశం, ఉదరి వెంకటేశం, గ్యార సుధాకర్, ఉదారి మహేష్, కొయ్యడి శేఖర్, దాసరి చంద్రయ్య,సిలివేరు వెంకటేశం, ప్రవీణ్, ఉదరి సుభాష్, జనగాం సురేష్, ఉబ్బు నవీను, గ్యార నరహరి, చింతల గణేష్ ,కేతరాజు శేఖర్, ఎలుకట్టే భాషయా, వివేక్, తదితరులు,ప్రముఖులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 11 :**
పట్టణ పరిధి జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం రోజు ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జీ మహంతి వైష్ణవి నీ నూతన కమిటీ కలుసుకోగా శుభాకాంక్షలు చెబుతూ బార్ అసోసియేషన్ మన కోర్టు మరింత అభివృద్ధి చెందేవిధంగా అందరూ కలిసికట్టుగా పనిచేసుకోవాలని తెలిపారు.

## సంఘసంస్కర్త, మహాత్మ జ్యోతి రావు పూలే



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 11 :**
చౌటుప్పల్ మున్సిపాలిటీ గాంధీ పార్క్ లో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో సామాజిక విప్లవకారుడు, అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసిన వీరుడు,అణగారిన వర్గాల, మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన ధీరుడు, సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే199 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన గురించి పలువురు మాట్లాడుతూ భారతదేశ బడుగులకు చదువులు నేర్పిన తొలి మహాత్ముడు బహుజన జీవుల జీవనదీపం, కుల వివక్షతకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాల హక్కులకై పోరాడి అండగా నిలిచిన పోరాట యోధుడు, విద్య ద్వారానే సమాజ అభివృద్ధి అని నమ్మి ఆ దిశగా కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, సామాజిక తత్వవేత్త శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బొంగు జంగయ్య గౌడ్ , బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునుకుంట్ల సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఆదిమూల శంకర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిలివేరు శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ , బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ సూర్యతేజ, బీసీ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు బండిగారి వెంకట్ , బీసీ యువజన సంఘం చౌటుప్పల్ మండల అధ్యక్షులు ముప్పిడి కృష్ణ చైతన్య, కుక్కల నరసింహ, లింగస్వామి, కొండోజు సంతోష్ కుమార్,పశువుల యాదయ్య, గంగాపురం శీను, శ్యామ్, బీసీ యువజన సంఘం నారాయణపూర్ మండలంఉపాధ్యక్షులు నవీన్, తోనేశ్వర్, శైలేందర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపి నాయకులు రేవంత్ రెడ్డి మాటలను తీవ్రంగా ఖండించుట



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ ఏప్రిల్ 11 :**
పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్, మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అడుగుపెట్టనివ్వను బ్రిటిష్ వారి కన్నా ప్రమాదం అన్న మాటలను తీవ్రంగా ఖండిస్తూ ఈరోజు జాతీయ రహదారిపై దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమణ గోని శంకర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు, చినుకాని మల్లేష్ యాదవ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, కడారి ఐలయ్య యాదవ్, ఉడుగు యాదయ్య గౌడ్, కట్ట కృష్ణ, వనం ధనంజయ, గోషిక పురుషోత్తం, కాసుల వెంకటేశం గౌడ్, కడవేరు పాండు, చికూరి వెంకటేశం, ప్రభాకర్, రధారపు సత్తయ్య, దిండు భాస్కర్, పబ్బు వంశీ, ఇటికల దామోదర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

# మహాత్మా జ్యోతీరావు పూలే సేవలు నేటి యువతరం నేర్చుకొని సమాజసేవ చేయాలి

### వచ్చే 200వ పూలే జయంతికి శంకర్ పల్లి బీసీ ఐక్యవేదిక భవనం నిర్మించుకుందాం

**శంకర్ పల్లి వెలుతురు ఏప్రిల్ 11**
దేశానికి సేవ చేసిన దేశభక్తులను, మహనీయుల చరిత్రలను నేటి తరం యువతీ యువకులు తెసుకొని సమాజసేవ చేయాలని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ పేర్కొన్నారు. మహాత్మా పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం శంకర్ పల్లి బస్ స్టండ్ ఎదురుగా ఉన్న శిలా విగ్రహానికి పూల మాలలు వేసి బీసీ ఐక్య వేదిక ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మహాత్మపూలే మహా ధైర్యవంతుడని, యువకుల్లో దేశ భక్తిని పెంపొందిన మహనీయుడని కొనియాడారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసి విఠల్ లు మాట్లాడుతూ పూలే విగ్రహ స్థాపన కోసం స్వర్గీయ బీ.క్రిష్ణ, ఎం.నర్సింహ స్వామిలు





ఎంతో కృషి చేశారని, వారి కష్ట ఫలమే నేటి ఈ విగ్రహ రూపమని, వీరికి తోడు ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్ లు అండగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పటి కాలంలో సమాజసేవతో పాటు బీసీలలో ఐక్యత పెంపొందిచడానికి అహర్నిషలు పోరాడిని పూలే సేవలు అజరామరమన్నారు. మళ్లీ వచ్చే పూలే 200వ జయంతి నాటికి శంకర్ పల్లిలో బీసీ ఐక్యవేదిక భవనం పూర్తి కావడానికి అందరూ శ్రద్ధ వహించాలన్నారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ మాట్లాడుతూ పూలే దేశం కోసం చేసిన సేవలకు ప్రజలు మహాత్మా అనే బిరుదునిచ్చారని, ఆయన సతీమణి సావిత్రి భాయి పూలే పెత్తందారులను ఎదిరించి అణగారిన ఆడపిల్లలందరిని ఏకం చేసి విద్యదానం చేసి మొట్టమొదటి భారతీయ మహిళ అని గుర్తుచేశారు. ప్రతీ గ్రామంలో పూలే విగ్రహ ఏర్పాటైనప్పుడే బీసీలలో పూర్తి ఐక్యత వచ్చినట్లని తెలిపారు. మార్కెట్ కమిటి వైస్ ప్రెసిడెంట్ కే.మోహన్, మాజీ కౌన్సిలర్ లు మాట్లాడుతూ మనమందరం పూలే బాటలో నడవాలని సమాజానికి పిలుపునిచ్చారు. విగ్రహ శ్రీకారకుల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలందరూ



ఐక్యంగా ఉండి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్, రాజేశ్ గౌడ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు రవిందర్ రెడ్డి, ప్రశాంత్, సేవా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సీ.జైరాంరెడ్డి, జీఎస్ వేణేంద్రచారి, సభ్యులు రవిందర్, మాజీ ఎంపీటీసీలు భిక్షపతి, రాంచందర్, బీజేపీ నాయకులు బిర్ల సురేశ్, పండిత్ రావు, టీచర్లు రాములు, అంజయ్య, మాణిక్యం, బీసీ ఐక్యవేదిక కుల సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిదులు, ఎస్సీ హాస్టల్ మెట్రిన్ జయప్రదరెడ్డి, విద్యార్థులు, టీచర్లు, ముదిరాజ్ నాయకులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పించన్ దారులను మోసం చేసిన మొట్టమొదటి ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- **బిజెపి మండల ఉపాధ్యక్షుడు సంపతి సుధాకర్ రెడ్డి**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు ఏప్రిల్ 11:**
సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల శాఖ ఉపాధ్యక్షులు సంపతి సుధాకర్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వయసు పైబడిన వృద్ధులకు ప్రభుత్వం అండదండగా నిలవాలనే సదుద్దేశంతో మొదటగా నెలకు 70 రూపాయలతో మొదలైన పింఛన్లను. తర్వాత కాలం లో వచ్చిన టిడిపి ప్రభుత్వం 100 రూపాయలు ఇస్తానని మాట నిలబెట్టుకున్నారు. ఆ తర్వాత వచ్చిన రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం 200 ఇస్తానని మాట నిలబెట్టుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం ఇతర హామీలను పక్కన పెట్టి ప్రజలను మోసం చేసినా పింఛన్ దారులను మోసం చేయకూడదని నెలకు వెయ్యి రూపాయలు పింఛన్ ఇస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నారు. అదే కెసిఆర్



రెండవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు కూడా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిన సరే కానీ నెలకు ?2016/- రూపాయల పెన్షన్ ఇస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నాడు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధులకు ఒంటరి మహిళలకు గీత కార్మికులకు నెలకు ?4000/- రూపాయలు పింఛన్లు ఇస్తానని వికలాంగులకు నెలకు ?6000/-రూపాయలు ఇస్తానని ప్రగల్బాలు చెప్పి హామీలు ఇచ్చి చివరకు పింఛన్ దారులను కూడా మోసం చేస్తున్నారు. ఇలాంటి ముఖ్య మంత్రి మొట్టమొదటి ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోనున్నాడు. కాబట్టి రాబోయే రోజుల్లో పింఛన్ దారులు ఎవరు కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే పరిస్థితి లేకుండా పోయిందని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనే పింఛన్ దారుల సత్తా ఏమిటో కాంగ్రెస్ పార్టీకి చూపిస్తారని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళా విద్య కు మార్గ దర్శకులు మహాత్మా జ్యోతి బాపూలే

- **ఆర్ ఆర్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

**వెలుతురు,రంగారెడ్డి జిల్లా,ఏప్రిల్11**
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని నేటితరం వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మహిళా విద్యకు పెద్ద పీట వేయాలని జిల్లా అదనపుకలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసికార్యక్రమాన్ని ప్రారంభించి మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్షకువ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన, బహుజన తత్వవేత్త సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిబా పూలే అని, ఆయన దేశానికి ఎన్నో సేవలు అందించారని, వర్ణవివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం,జ్యోతి రావు పూలే ఆచరించిన కార్యాచరణ మహెూన్నతమైనదని తెలిపారు. కుల, లింగవివక్షకు తావు లేకుండ విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థికసమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిబా పూలే ఆలోచన విధానాన్ని అందరు స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఆయన సహచరి సావిత్రి బాయి పూలేకుగురువుగా మారి ఉన్నత విద్యావంతురాలిగా తీర్చిదిద్ది, ఎంతో మంది మహిళలకు సావిత్రి బాయిచే విద్య నేర్పించారని, చరిత్రలో సావిత్రిబాయి మొట్టమొదటి మహిళా ఉపాద్యాయురాలిగా నిలిచి పోయారని తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను పూర్తి చేసే క్రమంలో ప్రతి ఒక్కరు పునరంకితం కావలసిన అవసరం ఉందని అన్నారు.

బాలికలకు, మహిళలకు చదువుకునేందుకు ప్రత్యేకంగా పాఠశాలలను నెలకొల్పారని ఈ విషయంలో ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని, కులవివక్షకు వ్యతిరేకంగా, మహిళలకు అండగా ఉంటూ ప్రస్తుతం అందరికీవిద్ యనందించేందుకు కృషి చేసిన ఘనత మహాత్మా జ్యోతిబా పూలేకు దక్కుతుందనిఅన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఆయన చేపట్టినసంస్కరణలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి బి.రమేష్ గీసిన మహాత్మా జ్యోతిబాపూలే చిత్ర పటానికి పూలమాల వేశారు. చిత్ర పటాని గీసిన బి.రమేష్ ను వక్తలుప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, బిసి సంక్షేమ అధికారి బి. కేశురాం, పిడి మెప్మా మల్లీశ్వరి, జిల్లా సివిల్సప్లయ్ అధికారి శ్రీనివాస్, ఈడీ ఎస్.సి కార్పొరేషన్ పద్మావతి, డిపిఆర్ఓ పి.సి.వెంకటేశం, బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేష్ యాదవ్, వడ్డెర సంఘం ప్రతినిధి బోసు రవి, కల్లు గీత కార్మిక సంఘం ప్రతినిధి సుధాకర్ గౌడ్, జిల్లా రజక సంఘం ప్రతినిధి అజయ్, బిసి సంఘం నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు,


## శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ అమ్మవారి దీపారాధన కోసం వితరణ



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 11**
వెల్లంకి గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో, నిత్య దీపారాధన కోసం 5,116 రూపాయలు విలువగల 2 కాటన్ల దీపం నూనెను ఇదెం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీ ఇదెం శ్రీనివాస్-రాధా దంపతులు దేవాలయ ప్రతినిధులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెల్లంకి గ్రామ దేవాలయాల కమిటీ చైర్మన్ ఎడ్ల నరేందర్ రెడ్డి, పూజారి వనం వెంకటేశం, గంజి రంగయ్య,పున్న వెంకటేశం,పిట్టె మహేందర్ రెడ్డి,కణతాల ఉమాపతి రెడ్డి,అంకం పాండు, గోధుమల సంగప్ప, తాటిపాముల స్వామి, తలారి లింగయ్య, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జహీరాబాద్ లో వీర హనుమాన్ జన్మదిన శోభయాత్ర

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ శ్రీ వీర హనుమాన్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వీర హనుమాన్ జన్మదిన శోభయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బజరంగ్దళ్ శ్రీ వీర హనుమాన్ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం జహీరాబాద్ పట్టణంలోని శ్రీ మాణిక్ ప్రభు మందిర్ నుండి ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకు భారీ శోభాయాత్ర కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. కావున హిందూ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఉత్సవ సమితి కమిటీ సభ్యులు కోరారు.

# పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

- సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు డిమాండ్

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**



పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమావేశంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు ప్రసంగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహిస్తామని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను మరచి ప్రజలపై పెను భారం మోపడం ఎంత వరకు సమంజసం అని ఆయన అన్నారు. ఒక ప్రక్కన పేద ప్రజలు కట్టెల పోయిలతో ఇబ్బందులు పడుతున్నారు వారికి కొన్ని పథకాల ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్ లు ఇస్తామని మరికొన్ని దీపం పతాకం పై కొన్ని వివిధ కోణాల్లో గ్యాస్ సిలిండర్లు ప్రజలకు పంపకం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తూ వారితో కుమ్మక్కై ఒకసారి గ్యాస్ సేలండర్ ప్రజలకు అందిస్తే ఐదు సంవత్సరాలు ప్రజలను మోసం చేయొచ్చు ఏన్ని సారులైన గ్యాస్ ధరలను పెంచుకోవచ్చు అన్న ఆలోచనలతో ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని వాటిపై సబ్సిడీ ఇస్తాం అని చెప్పారు కాని ఇంతవరకు ఎవ్వరికీ కూడా సరిగ్గా సబ్సిడీ ఇవ్వడం లేదని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే విదంగా గ్యాస్ ధరలు పెంచుతూ పోతుంటే సామాన్య ప్రజలు పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మార్కెట్లో రోజువారీ ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలమైనయని ఆయన ఆరోపించారు. ఒక ప్రక్కన రోజువారీ పనులు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వారు ఏ విదంగా గ్యాస్ లు వాడుతారని ఆయన అన్నారు. ఈ ధరలతో ప్రజలకు విసుగొచ్చి గత మాదిరిగానే కట్టెల పోయిలు వాడుకునే పరిస్థితి వస్తుందని ఆయన అన్నారు. అందుకని పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన తమ ప్రకటనలో హెచ్చరించారు. ఈ కార్యక్రమములో మహిళా సంఘం నాయకురాలు శోభమ్మ, మంగమ్మ, సుశీలమ్మ, తేజమ్మ, తుల్జామ్మ, సత్యమ్మ, హనుమమ్మ, చంద్రకళ, అనసూయ, మదవమ్మా, పుష్ప, వినయ్ కుమార్, సంజీవ్, నర్సింహా, కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలి

- మహాత్మా జ్యోతిబాపూలే గారికి భారత రత్న ఇవ్వాలి.
- జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**



సామాజిక సమానత్వానికి, మహిళా విద్యకు మార్గదర్శకులు జ్యోతిభాపూలేగారనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆయన 199వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతు అణగారిన వర్గాల అభ్యున్నతికి వారి విద్యాభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త ఆయన అని విద్యతోనే జీవితాల్లో సుస్థిరమైన మార్పులు సాధ్యమవుతాయని తెలుసుకొని స్వయంగా తన భార్యకు పాఠాలు నేర్పించి అందరికీ విద్యాబుద్ధులు నేర్పించి ఆదర్శప్రాయుడైనాడు. ఆయన ఆశయం కోసం నేటి యువత పోరాడాలని అన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలని అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం పూలే గారికి భారతరత్న ఇచ్చి గౌరవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పుల మధు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ బండి గారి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రావి నారాయణరెడ్డి కాలనీలో ఘనంగా పులే జయంతి వేడుక



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, ఏప్రిల్ 11:**

రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీ -3.( భూ పోరాట కేంద్రంలో )సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు , ఈ సందర్భంగా సీపీఐ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు, పూలే బడుగులు కోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు, ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పి0చారు,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొన్నారు అలాగే స్కూల్ విద్యార్థులతో కలిసి సిపిఐ పార్టీ నాయకులు హరి సింగ్,కార్యకర్తలు ఘనంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు,

## రాఘవేంద్ర కాలనీవాసులతో సమావేశమైన కార్పొరేటర్ కళ్లెం



**వెలుతురు, హయత్ నగర్,ఏప్రిల్ 11:**

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్ర వారం నాడు మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్ లోని రాఘవేంద్ర కాలనీవాసులతో కాలనీ కమ్యూనిటీ హాల్ లో సమావేశమయ్యారు, ఈ సందర్భంగా ఆయన కాలనీలో నీ సమస్యలు మరియు కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది, కాలనీవాసులు కాలనీలో ప్రధానంగా ఉన్న మంచినీటి సమస్య ఉందని కార్పొరేటర్ కు వివరించడంతో కార్పొరేటర్ జీవన్ రెడ్డి స్పందించి జలమండలి ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా కాలనీ లోని మంచినీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన కాలనీవాసులకు హామీ ఇవ్వడం.ఈ సమావేశంలో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్ , కాలనీ అధ్యక్షులు కొట్ట రవీందర్ రెడ్డి , సంక్షేమ సంఘం సభ్యులు చిన్న , హరినాథ్ బాబు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహెూన్నతమైన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే...

- ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్..




**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**

మహిళలోకానికి అక్షర లోకాన్ని చూపించి మహిళా జ్యోతులుగా తీర్చిదిద్దిన మహెూన్నతమైన వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కూకట్ పల్లి నియోజక వర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ భారతీయ సామాజిక వ్యవస్థ, సామాజిక సమానత్వం, మహిళా సాధికారత, విద్య తదితర అంశాలలో ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్ , వేముల మహేష్ , కలిగినీడి ప్రసాద్, గుణశేఖర్, పాదం సూర్య, కళ్యాణ్, రణదీప్, వీర మహిళ అనిత తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ లో ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు




**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడలే స్ఫూర్తిగా పయనించాలని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మహాత్మా జ్యోతిబా పూలే జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల, పుష్పాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, సామాజిక సంఘ సంస్కర్త, సమాజంలోని అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, విద్య కోసం జీవితాంతం కృషి చేసిన సంఘసేవకుడైన మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకొన్నారు. సామాజిక సంస్కరణలు, మానవ హక్కులు, సమ సమాజ స్థాపన, మహిళల విద్యాభివృద్ధికి నాంది పలికిన మహాత్ముడని అన్నారు. వారి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, సీనియర్ నాయకులు నామ రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు బండి మోహన్,మహిళ పట్టణ అధ్యక్షురాలు మంజుల, జాగృతి అధ్యక్షురాలు అనుషమ్మ, యువ నాయకులు మిథున్ రాజ్, మాజీ ఆలయ చైర్మన్ నర్సింహ గౌడ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు శివప్ప, వార్డ్ అధ్యక్షులు దత్తాత్రేయ, అలి, వెంకట్, విశ్వేశ్వర్, బిఆర్ఎస్వి అధ్యక్షులు రాకేష్, నాయకులు తులసి దాస్ గుప్తా, రాజ రమేష్, జగదీశ్వర్, ఆనందం, ప్రవీణ్ పాటిల్, ఎజాస్ బాబా, గణేష్, నర్సింహ రెడ్డి, దీపక్, లక్ష్మీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన వర్గాల విప్లవ జ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే

*బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్*

**కరీంనగర్, వెలుతురు ఏప్రిల్ 11:**




బహుజన వర్గాలకు విద్యను అందించి సామాజిక చైతన్యంతో అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం చేసిన బడుగుల విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతి బా పూలే అని బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ కొనియాడారు. శుక్రవారం రోజున మహాత్మ జ్యోతి బా పూలే 198 వ జయంతిని పురస్కరించుకొని బి కె యం యు ఆధ్వర్యంలో కోతిరాంపూర్ లోని జ్యోతి బా పూలె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానుభావుడని, స్త్రీలు చదువుకోవాల్సిందే అని పట్టుబట్టి వారి కోసం ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని,బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలిచిన పోరాట యోధుడు అని అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే భౌతికంగా ప్రపంచాన్ని వదిలి 135 ఏళ్లయినా బడుగుల మేలు కోసం పూలే పడిన ఆరాటం, చెసిన త్యాగం నేటి తరం స్ఫూర్తిని పొందుతున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అన్ని వర్గాలకూ సమాన హక్కులు ఉండాలనీ స్త్రీలు సంఘంలో భాగం కావాల్సిందే అని పోరాటం చేసి దేశాన్నే మేల్కొలిపిన మహనీయుడని అగ్రవర్ణాల నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నప్పటికీ ఆ రోజుల్లో చదువుకునేందుకు పరిస్థితులు సహకరించకున్నా అన్నీ తట్టుకుని అందరి కోసం జీవితం అంకితం చేశారు.పూలే దంపతులు జీవితాన్ని పూర్తిగా బడుగుల అభ్యున్నతికి అంకితం చేశారని సృజన్ కుమార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కూన రవీందర్, నల్లగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మహాత్మా జ్యోతిబాపూలే గారికి భారత రత్న ఇవ్వాలి

- వరికుప్పల మధు బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు.

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**



సామాజిక సమానత్వానికి, మహిళా విద్యకు మార్గదర్శకులు జ్యోతిభాపూలే గారు అని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల మధు గారు అన్నారు.ఆయన 199వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి వారి విద్యాభివృద్ధి కోసం వారి జీవితాల్లో వెలుగులు నింపడం కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని విద్యతోనే జీవితాల్లో సుస్థిరమైన మార్పులు సాధ్యమవుతాయని తెలుసుకొని స్వయంగా తన భార్యకు పాఠాలు నేర్పించి అందరికీ విద్యాబుద్ధులు నేర్పించి ఆదర్శప్రాయుడైనాడు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయం కోసం ఆయన కలలు కన్న సమానత్వ సమాజం కోసం, రాజ్యాధికారంలో బీసీలకు సమాన వాటా దక్కేలా నేటి యువత పోరాడాలని అన్నారు.ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించి బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలను ఇవ్వాలని అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం పూలే గారికి భారతరత్న ఇచ్చి గౌరవించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ,విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు , విద్యార్థి సంఘం నాయకులు బండి గారి భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

- జహీరాబాద్ లో వెంటనే జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి...
- టిఎస్ఎస్ సిసిడిసి (ఎస్సి కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం డిమాండ్...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి టిఎస్ఎస్ సిసిడిసి (ఎస్సి కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం పూలమాలలు వేసి పార్టీ నాయకులతో కలిసి ఘనంగా జయంతి వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కొరకు ఎంతో కృషి చేసిన మహానియుడు పూలే అని, బడుగు బలహీన వర్గాలు వారిని స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని అన్నారు. ముఖ్యంగా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని పట్టణంలో వెంటనే ఏర్పాటు చేయాలిని డిమాండ్ చెసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వామిదాస్,రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షులు సి.బాల్ రాజ్, నాయకులు యస్.గోపాల్, టి.శివన్న, శివకుమార్, చెంగల్ జైపాల్, బి.విఠల్, నాగన్న, దిలీప్, అనిల్, బాల్ రాజ్, విఠల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మల్గి గ్రామంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**



వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు సామాజిక ఉద్యమకారులు మార్గదర్శి మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం మల్గి గ్రామ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతీ కురుమ ఆధ్వర్యంలో గ్రామ బిఆర్ఎస్ నాయకులు మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎంపీటీసీ శివానంద శ్రీపతి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సిద్ధా రెడ్డి, యువనాయకులు తుకారం, మహేష్, ఆనంద్, జగన్నాథ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి - కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జన నివాసాలు పెరిగి డ్రైనేజీ వ్యవస్థ సరిపోకపోవడంతో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మరేళ్ల శ్రీనివాస్, జి.రవి, పోశెట్టిగౌడ్, నాగేష్ గౌడ్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే పోరాటం...

- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు



**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**
అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే అలుపెరుగని పోరాటం చేశారని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. శుక్రవారం పూలే 198వ జయంతి సందర్భంగా శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ రిక్షా పుల్లర్స్ కాలనీలో వారు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడెట్కన జ్యోతీరావ్ గోవిందరావ్ పులే భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట నిలిచారని విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశారని ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు అని తెలిపారు. లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పులే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని అతను, అతని భార్య సావిత్రిబాయి పులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, సతీష్ రావు, గిరిబాబు, ఆంజనేయులు, బాబు, సత్యనారాయణ, సోమయ్య, రా0చందర్, రామ్మూర్తి, వెంకట్ రెడ్డి, శ్రీనివాసరావు, జగదీష్ గౌడ్, యశ్వంత్, అఖిల్, మల్లేష్, సంతోష్, వాసు, హరీష్, ప్రవీణ్, రవి,సాయి, కిరణ్, సానప్ప, రాజు, వినయ్, హరీష్, రవి, రాధిక, రాధా, మాధవి రెడ్డి, అవనిత, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి జన్మదిన సందర్బంగా శ్రీ మణికంఠ సేవసమితి ఆద్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి మహపడిపూజ...



**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**
శ్రీ మణికంఠ సేవసమితి ఆద్వర్యంలో పంచమి కాలనీ శ్రీ మరెమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన ఉత్తరణక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ అయ్యప్పస్వామి జన్మదిన సందర్బంగా మహపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు , జిల్లా గణేష్, నర్సింగ్ యాదవ్, సతీష్ రావు, తెల్ల హరికృష్ణ, వి రాకేష్, వి కళ్యాణ్, సురభి రమేష్ రావు, మంజుల యాదవ్, అమూల్య తదితరులు అయ్యప్ప స్వామిని దర్శించుకొని పల్లకి ఊరేగింపు అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మణికంఠ సేవసమితి కమిటీ సభ్యులు, శ్రీ మరెమ్మ తల్లి దేవాలయ కమిటీ అభ్యులు, మహిళలు, భక్తులు, అధికసంఖ్యలో పాల్గోని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పాత పోచంపల్లి రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర మంత్రి కి వినతి పత్రాన్ని అందజేసిన ఎంపీ ఈటల రాజేందర్



**వెలుతురు, ఎల్ బి నగర్,ఏప్రిల్ 11:**
మన్సూరాబాద్ నుండి పాత పోచంపల్లి రోడ్డును పునఃఅభివృద్ధి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని సమర్పించినట్లుగా జీఎంహెచ్ సీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి తెలిపారు, మన్సూరాబాద్ పాత పోచంపల్లి రోడ్డును పునఃఅభివృద్ధి చేయాలని డిల్లీలో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రివర్యులు భూపేంద్ర యాదవ్ ని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కలిసి వినతిపత్రం అందజేశారని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లో లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పేర్కొంటూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించడానికి డీపీఆర్ నివేదికను ఇవ్వాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ లేఖను రాయడం జరిగిందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని, కేంద్ర ప్రభుత్వానికి కనీసం లేఖ కూడా రాయలేదని గుర్తు చేశారు. క్రిడా & అటవీశాఖ సంబంధించిన ప్రహరి గోడలను తీసేసి, రోడ్డు అభివృద్ధికి కావలసిన స్థలాన్ని కేటాయించే విధంగా అధికారులను సమన్వయం చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. గౌరెల్లి ఔటర్ రింగ్ రోడ్ కు కనెక్ట్ అయ్యే విధంగా రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతే మన్సూరాబాద్ పరిసర ప్రాంత 60 కాలనీలకు డిస్టెన్స్ తగ్గి, ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తవని తెలిపారు. ఈ పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరించడానికి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ విషయానికి సంబంధించి ఢిల్లీ నుండి ఎల్బీనగర్ వరకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తున్నందుకు ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రగతి భవన్ ను పూలే భవనంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం...

- లికూకట్ పల్లిలో మహాత్మ జ్యోతి రావు సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటు..
- ఐడియల్ రోడ్డు లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..
- వచ్చే జయంతికి సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ..
- బిఆర్ఎస్, బిజెపిలు తమ వైఖరి స్పష్టం చేయాలి
- కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**
వచ్చే ఏడాది మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలేల విగ్రహాలను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని హౌసింగ్ బోర్డ్ కాలనీ లోని తన కార్యాలయంలో ఆయన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రగతి భవనం మహాత్మ జ్యోతిబాపూలే గా మార్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వని హామీలు కూడా ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అమలు చేస్తుందన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో ఇంతవరకు మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం లేకపోవడం గత పాలకుల నిర్లక్ష్యమేనని అన్నారు. వచ్చే ఏడాది పూలే జయంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఐడియల్ చెరువు ప్రారంభంలోనే మహాత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసి జ్యోతిబాపూలే మార్గ్ గా నామకరణం చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 42 శాతం రిజర్వేషన్లు అమలుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదింప చేయడం అది ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు నియోజకవర్గంలో విగ్రహ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని శేరి సతీష్ రెడ్డి బిజెపి పార్టీ నాయకులతో పాటు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, మేకల మైకల్, రేష్మ నాయుడు, ఫణింద్ర కుమార్, దేవ సహాయం, క్రిస్టోఫర్, రఘునందన్ బాబు, పిడికిటి గోపాల్ చౌదరి, మారుతి, యమునా, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి అక్రమ కట్టడాలతో నాశనం కావడానికి కారణం మీరు మీ షాడో నే

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...

**కూకట్ పల్లి ఏప్రిల్ 11 వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గం అక్రమ కట్టడాలతో నాశనం కావడానికి కారణం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అతని షాడో నే అని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హౌసింగ్ బోర్డులో యాబై బిల్డింగ్ లు అక్రమ కట్టడాలు వెలిశాయని అక్రమ కట్టడాల మీద డబ్బులు వసూలు చేస్తున్నారని చేసిన వ్యాఖ్యలపై సత్యం శ్రీరంగం స్పందించి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఎమ్మెల్యే 15 వ ఫేస్ గురించి మాట్లాడడం పై 15 వ ఫేస్ లో తన ఇంటి పక్కనే ఉన్న హెచ్ఐజి 63 లో కట్టిన బిల్డింగ్ పక్కన కరెంట్ లైన్ 33 కేవీ లైను, 11 కేవీ లైను పోతుంది అక్కడ జరుగుతున్నా నిర్మాణంలో ఒక్క వ్యక్తి చనిపోతే గతంలో ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 1082 / 2024 రికార్డు అయిందన్నారు. ఈ అపార్ట్మెంట్ పూర్తి అయిన తరువాత మరో సంఘటనలో ఎవరైనా చనిపోతే ఎమ్మెల్యే బాధ్యత వహిస్తారా.. అని ప్రశ్నించారు. 15 వ ఫేస్ లో ఒకే బిల్డర్ ఏడూ బిల్డింగ్ లు కడుతున్నారు. అక్కడ నలబై ప్లాట్ లు ఉంటే ఇతను ఒక్కరే ఏడూ బిల్డింగ్ కడుతున్నారు. అంటే ఒక్కొక్క ప్లాట్ లో 11 ఫ్లాట్స్ కడుతున్నారు. ఆఖరికి మీ పరాకాష్ట నా ఇంటి పక్కన



ఉన్న హెచ్ఐజీ 63, 67 సీజ్ చేసిన అపార్టుమెంట్లను, సీజ్ బ్రేక్ చేసి కట్టారు ఎవ్వరు డబ్బులు వసూలు చేసి కట్టించారో నిగ్గు తేల్చాల్సిందే. అక్రమ కట్టడాల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నది మీ షాడో నే అన్నారు. మీ ఫార్మ్ హౌస్ పాలనలో ఇదే షాడో రెండు వందల బిల్డింగ్ దగ్గర విలేకరుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేసి ఆస్తులు కూడా పెట్టింది మీ షాడో నే. మీరు ఖాళీ ల్యాండ్స్ లో మొక్కలు పెట్టించి, డబ్బాలు పెట్టించి, వైన్స్ లకు సిటింగ్ లు పెట్టించి నెల నెల అక్రమంగా డబ్బులు వసూలు చేయడం లేదా, వీటన్నిటికీ బాధ్యత మీదే అని అన్నారు. నేడు హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రతి రోడ్డు లో బండ్లు పోయే పరిస్థితి లేకుండా ఇంత దారుణంగా తయారు కావడానికి మీరు, మీ షాడో నే కారణం అన్నారు. కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు ల్యాండ్స్ కాపాడుతుంది మా ప్రజాప్రభుత్వం అని అన్నారు. ఇపుడు ఈ యాబై మంది అపార్టుమెంట్లలో సీజ్ అయిన బిల్డర్లలో ఎవరైనా బిల్డర్లు, కాంట్రాక్టర్లు గా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారా, కూకట్ పల్లి నియోజకవర్గంలో బిల్డర్లు, కాంట్రాక్టర్లు గా ఉన్నది బిఆర్ఎస్ నాయకులు కదా అని అన్నారు. బోయిన్పల్లి నుండి కెపిహెచ్బి వరకు, అల్లాపూర్ నుండి బాలానగర్ వరకు అనేక అక్రమ కట్టడాల్లో మీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు వాళ్ళ బంధు వర్గం వారేకదా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు ఎంత మంది వాళ్లు అక్రమ కట్టడాలు కడుతున్నారో, ఎన్ని వాళ్ళ బినామీ పేర్లమీద కడుతున్నారో అన్ని బయటకు తీసి దృష్టికి తీసుకువెళ్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ రాష్టంలో బిల్డర్ల ఉసురు పోసుకోవడానికి ప్రధాన కారకులు మీ పెద్ద దొర కేసీఆర్, చిన్న దొర కేటీఆర్ ఎకరానికి నాలుగు లక్షల ఎస్ఎఫ్ టి కి ఎఫ్ఎస్ఐ ఇచ్చి బిల్డర్ల వ్యవస్థను నాశనం చేశారని పేర్కొన్నారు.

# మన సంస్కృతి.. అద్భుత ప్రయాణం

- చిన్నారులకు మన సంస్కృతి నేర్పించండి...
- మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి...





**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
తల్లిదండ్రులు తమ పిల్లలకు హిందూ సంస్కృతి, సాంప్రదాయాల గురించి నేర్పించాలి. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి గొప్ప కథల నుండి నీతి కథలను దేవుళ్ళ కథలు, పండుగల గురించి చెప్పడం అలవాటు చేసుకోవాలని మహామండలేశ్వర బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 1008 డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి భక్తులకు, తల్లిదండ్రులకు సూచించారు. ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన కోట బాలమణి-రాజు దంపతుల కుమార్తె సాత్విక, కుమారుడు వంశీకృష్ణల పుట్టు పంచ వేడుకకు ఆయన హాజరై పిల్లలను దీవించారు. ప్రతి ఒక్కరూ మన సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లలకు జరపవలసిన హిందూ సాంప్రదాయ పండుగలను నిర్వహించినందుకు కోట బాలమణి-రాజు దంపతులను ఆయన అభినందించారు. కొత్త బట్టలు వేయడం అంటే పిల్లలు సాంప్రదాయ దుస్తులు ధరించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపే పండుగ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

# ముంబై దాడుల నుంచి తప్పించుకున్నా

## ఆనాటి ఘటనపై పోస్ట్ చేసిన అసోం సిఎం

**గౌహతి,ఏప్రిల్11( వెలుతురు):**
ముంబైపేలుళ్ల కేసులోప్రధాన నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా ను భారత్‌కు తీసుకురావడంతో నాటి భయానక పరిస్థితుల్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సైతం ఆ మారణహోమాన్ని తలచుకున్నారు. ఆ దాడినుంచి తాను తృటిలో తప్పించుకున్నట్లు చెప్పారు. 'ఉగ్రదాడులు జరిగిన రోజే తాను ముంబై తాజ్ హోటల్లో బస చేయాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగాను. దీంతో ఆ దాడి నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడ్డా. ఆ రోజు జరిగిన ఎన్ఎస్జీ ఆపరేషన్ ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతోంది. కర్మ సిద్ధాంతం ప్రకారం దాడుల వెనక ఉన్న సూత్రధారులు ఏదో ఒకరోజు శిక్ష ఎదుర్కోక తప్పదని అప్పుడే భావించా. దాడి జరిగిన పదహారేళ్ల తర్వాత నిందితుడిని దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థలపై మరింత విశ్వాసం పెరిగింది' అని హిమంత వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 16 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొలాబా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా నగరంలో మారణహోమాన్ని సృష్టించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, ముంబై చాబాద్ హౌస్, నారిమన్ హౌస్, కామా హాస్పిటల్ తదితర



ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ దాడులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడంలో రాణా కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడిపై కేసులు నమోదయ్యాయి. ఇక దాడి జరిగిన ఏడాది తర్వాత అంటే 2009లో షికాగోలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన అమెరికా జైలులోనే శిక్ష అనుభవించారు.

## గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



**వెలుతురు, హైదరాబాద్ 11ఏప్రిల్:**
స్వాతంత్రం రాకముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలం గాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయా లని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్, అంబర్ పేట, అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ దిడ్డి సుధాకర్, డా.అన్సారీ, సుధారాణి, భాస్కర్, శహనవాజ్, ధర్మేంద్ర తివా రి, రాకేష్ రెడ్డి, రాకేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. అనంతరం దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ జ్యోతి రావు పూలే అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి, సామాజిక న్యా యాన్ని ప్రోత్సహించడానికి తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేసారు. మహిళల హక్కులను హ రించే అణచివేత పద్ధతులకు వ్యతి రేకంగా ఆయన పోరాటాలు సాగిం చారని కొనియాడారు. భారతదే శంలో ప్రగతిశీల సామాజిక సంస్క రణ ఉద్యమాలకు పునాది వేసిన జ్యోతిబా పూలే ఆశయ సాధనకై కృషి చేస్తామని ఆయన పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాగ్ అంబర్ పేటలో ముఖ్య కార్యకర్తల సమావేశం...



**వెలుతురు, హైదరాబాద్ 11ఏప్రిల్:**
బిజెపి బాగ్ అంబర్ పేట డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ అధ్యక్షతన డి.డి కాలనీలోని శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర సహ కోశాధికారి ఓ.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6వ తేదీ నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు శుభ్రత పరిశుభ్రత సేవా కార్యక్రమాలు, దేవాలయాల సందర్శన, బిజెపి బస్తి బాట కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. డివిజన్ లోని నాయకులు, కార్యకర్తలు అన్నింటినీ విజయవంతం చేయాలని అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క కార్యకర్త వారి ఇంటిపై బిజెపి జెండాను ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు

- అనంత చంద్ర శేఖర్ గౌడ్



**చండూరు వెలుతురు ఏప్రిల్ 11:**
శుక్రవారం రోజున చండూరు మున్సిపాలిటీ గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో.. అంటరానితనాన్ని ఖండించి, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త. నవయుగ వైతాళికుడు.. మహాత్మా జ్యోతీరావు పూలే 199వ జయంతి సందర్భంగా పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది వారి ఆశయాల కోసం కృషి చేయాలని సమరించడం జరిగింది . కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్,మాజీ సర్పంచులు కోడి గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకోజి బ్రహ్మం కల్లెట్ల మారయ్య, కారింగు రామ్మూర్తి, భూతరాజు దశరథ, బెల్లకొండ శేఖర్, పన్నాల లింగయ్య, ఐతరాజు మల్లేష్, బోడ వెంకటేశం, జర్నలిస్టుల యూనియన్ (ఐజేయు) నియోజకవర్గ అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్,ఇరిగి శంకర్, , గండు రమాదేవి, ఇరిగి వెంకటేశం, బొమ్మగోని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకల్లో జాజుల లింగం గౌడ్ ను శాలువా, మెమొంటో తో సత్కరిస్తున్న చిన్న శ్రీశైలం యాదవ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
హైదరాబాదులోని ఫిలింనగర్ లో జరిగిన మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకల్లో గత 22 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేస్తునందుకు జాజుల లింగం గౌడ్ ను శాలువా, మెమొంటో తో సత్కరిస్తున్న చిన్న శ్రీశైలం యాదవ్ మరియు బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శీనన్న.


## ఏసీబీ వల చిక్కిన అవినీతి అధికారి

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో,ఏప్రిల్ 11:**



ఒక వ్యక్తి తన సి.పి.ఎస్. ఖాతాలో డబ్బులు తీసుకునేందుకు సహకరించడానికి రూ.7 వేల రూపాయల లంచం తీసుకుంటూ తెలంగాణ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ జగిత్యాల జిల్లా ఖజానా కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న అరిగె రవికుమార్ పట్టు పడ్డారు, ఆయన పై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు,కాగా ఏసీబీ అధికారులకు చిక్కిన రవి కుమార్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, కాగా బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఏసీబీ అధికారులు ఆయన ను వల వేసి పట్టుకున్నారు,అలాగే ఏసీబీ అధికారుల విజ్ఞప్తి మేరకు ఏ ప్రభుత్వ సేవకుడు అయినా లంచం అడిగినట్లయితే ప్రజలు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ వారి టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు డయల్ చేయండి. అంతే కాకుండా వివిధ సామజిక మధ్యమాలయిన వాట్సాప్ ( 9440446106), ఫేస్ బుక్ (Telangana ACB) మరియు ఎక్స్ (TelanganaACB) ద్వారా కూడా ACBని సంప్రదించవచ్చునని తెలిపారు,

## జ్యోతిబాపూలే మరియు సావిత్రిబాయి పూలే విగ్రహాలని ఆవిష్కరించి జయంతి ఘనంగా నిర్వహించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 11:**
శుక్రవారం రోజున మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ చౌరస్తాలో జ్యోతిబాపూలే మరియు సావిత్రిబాయి పూలే విగ్రహాలని ఆవిష్కరించి వారికి దండలు వేసి జయంతి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, వినోద్ గౌడ్, రాజేంద్రప్రసాద్, గ్యాని, ప్రియ రాజ్, పూర్ణచందర్, జిల్లా శివ, ఫారుక్, సంజీవరెడ్డి, రమేష్, జాకి, మహేష్, మన్సూర్,జైస్వాల్, ప్రదీప్ రెడ్డి, బిండియా,ఓం ప్రకాష్, ఫసి, బాలకృష్ణ,శేఖర్, సాయి, సందీప్, అజార్, మొషిన్, అఖిల్, హసన్ ఖాద్రి, జహీద్, జగదీష్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి ని ప్రశాంతంగా జరుపుకోవాలి:సీఐ

**వెలుతురు, బేగంపేట్, ఏప్రిల్ 11.**




శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నాడు బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గట్టి పోలీస్ బందో బస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సి ఐ ప్రసాద రావ్ వెల్లడించారు. ఈ సందర్భంగా సి ఐ ప్రసాద్ రావు మాట్లాడుతూ బేగంపేట్ పరిధిలోని రసూల్ పురా, పాటిగడ్డ, శ్యామ్ లాల్, ప్రకాష్ నగర్, బ్రమ్మనవాడి తదితర ప్రాంతాల్లో నిర్వహించే శ్రీ హనుమాన్ శోభ యాత్రలో ఏలాంటి అవంచనియా సంఘటనలు జరుగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ శోభ యాత్రకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ శోభ యాత్రలో సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్త కుండా సంఘటనలకుఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు , శోభ యాత్రకు అన్న వర్గాలు సహకరించి విజయవంతం కావడానికి దోహద పడాలని సీఐ ప్రసాద్ రావు కోరారు,



## పేదల సంక్షేమ కోసం సిఎం సహాయనిది

- అనంత చంద్ర శేఖర్ గౌడ్

**చండూరు వెలుతురు ఏప్రిల్ 11:**
శుక్రవారం రోజున గౌరవ శాసనసభ్యులు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 10 మంది లబ్దిదారులకు 3,63,000 వచ్చిన చెక్కులను లబ్దిరులకు గెస్ట్ హౌస్ దగ్గర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ అ0దించడం జరుగుతుంది లబ్దిదారుల వివరాలు

01. పంపాటి బిక్షమయ్య S/o జంగయ్య చండూరు 52,000
02. భూతరాజు అంజమ్మ W/o ముత్తయ్య చండూరు 26,000
03. కమ్మపాటి బుచ్చయ్య S/o లచ్చయ్య lachayya 36,000
04. గంట యాదమ్మ 32,000
05. కె అంజయ్య తండ్రి మారయ్య 33,000,
06. షేక్ షమీనా భర్త రంజాన్ 28,000,
07. కె బిక్షమయ్య తండ్రి ముత్తయ్య 40,000,
08. పున్న వినోద్ తండ్రి లింగయ్య 58,000,
09. కె కళావతి భర్త వెంకటేశం 31,000,
10. గంట పుల్లయ్య తండ్రి పెంటయ్య 27,000,

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచులు కోడి గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకోజి బ్రహ్మం కల్లెట్ల మారయ్య, కారింగు రామ్మూర్తి, భూతరాజు దశరథ, బెల్లకొండ శేఖర్, పన్నాల లింగయ్య, ఐతరాజు మల్లేష్, బోడ వెంకటేశం, జర్నలిస్టుల యూనియన్ (ఐజేయు) నియోజకవర్గ అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్,ఇరిగి శంకర్,, గండు రమాదేవి, ఇరిగి వెంకటేశం, బొమ్మగోని కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## భగ్గుమన్న బంగారం ధరలు

- **మేలిమి బంగారం రూ.96,450కు చేరిక**

**న్యూఢిల్లీ,ఏప్రిల్11( వెలుతురు):**
బంగారం ధర మళ్లీ భగ్గుమంది. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలతో పసిడి ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోరు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో పసిడికి పెట్టుబడులు మళ్లుతున్నాయి. దీంతో దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6250 పెరిగి శుక్రవారం రూ.96,450కు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్లో రూ.96,430 స్థాయి వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాము) బంగారం ధర 3,223 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇంట్రాడేలో 3,237 డాలర్లకు చేరుకుంది. దీన్ని అనుసరించి దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు ) బంగారం ధర రూ.96 వేల మార్కు దాటింది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.96 వేలు పలుకుతోంది. వెండి కిలో రూ.95,500 పలుకుతోంది. వాణిజ్య యుద్ధ భయాలతో ఏప్రిల్ 2న బంగారం ఔన్సు అంతర్జాతీయంగా 3200 డాలర్లను తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే, ఇతర దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేసిన ట్రంప్.. చైనాపై మాత్రం కొనసాగించారు. ఈ పరిణామాలు వాణిజ్య, ఆర్థిక అనిశ్చితులకు కారణమయ్యాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. డాలర్ ఇండెక్స్ నూరు డాలర్లకు దిగువకు చేరడం పసిడికి మరింత డిమాండ్ పెంచింది. సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలను పెంచుకుంటుండడంతో పుత్తడి ధరకు రెక్కలు రావడానికి కారణమని విశ్లేషిస్తున్నారు.

## ఊపిరి పీల్చుకున్న స్టాక్ మార్కెట్లు

- **లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు**

**ముంబై,ఏప్రిల్11( వెలుతురు):**
దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేయడంతో ట్రేడర్ల ఉత్సాహంతో స్టాక్ మార్కెట్లు భారీ లాభాలలో ముగిసాయి. ట్రంప్ ప్రభుత్వం అదనంగా విధించబోయే ప్రతీకార సుంకాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు- ప్రకటించడంతో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఇదివరకు ట్రంప్ 60 దేశాలపై అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై అదనపు సుంకాలను విధించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ట్రంప్ ప్రభుత్వం ఈ సుంకాల అమలును జూలై 9వ తేదీ వరకూ వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఈ ప్రకటన ట్రేడింగ్ ప్రారంభానికి ముందే రావడం వల్ల, మార్కెట్ ఆరంభంలోనే లాభాలవైపు దూసుకెళ్లింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు సెన్సెక్స్ 74835 పాయింట్ల వద్ద పాజిటివ్‌గా మొదలు కాగా.. ఇంట్రాడేలో కనిష్ఠంగా 74,762 పాయింట్ల వద్ద, గరిష్ఠంగా 75,467 పాయింట్ల వరకు వెళ్లింది. ఇక మార్కెట్ ముగిసే సమయానికి 1,310 పాయింట్ల భారీ లాభంతో 75,157 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ కూడా 430 పాయింట్ల లాభంతో 22,828 వద్ద ముగిసింది. ఈ రోజు ట్రేడింగ్‌లో మెటల్ సూచీ అత్యధికంగా 4 శాతం పెరగగా.. హిందాల్కో, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, కోల్ ఇండియా, జియో ఫైనాన్షియల్ వంటి కంపెనీలు అత్యధిక లాభాలను నమోదు చేశాయి. వీటితోపాటి ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, పీఎస్‌యూ, -టె-లికాం, ఫార్మా రంగాలు కూడా భారీ లాభాలలో ముగిసాయి. మొత్తంగా చూస్తే, ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ తాత్కాలిక నిర్ణయం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచింది. అదనపు సుంకాల వాయిదా నిర్ణయం వల్ల ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడిని తగ్గించి, దేశీయ మార్కెట్లకు ఉపిరిలా పనిచేసింది.






# లక్షన్నర కోళ్లను చంపడమే పరిష్కారం



**మెదక్ ఏప్రిల్ 11, ( వెలుతురు)**

తెలంగాణలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి మళ్లీ క్రమంగా పెరుగుతోంది. నిన్నమొన్నటి వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావంతో వేలాది కోళ్లు చనిపోయాయి. పౌల్ట్రీ పరిశ్రమల్లో కోళ్లు చనిపోవటంతో ఆ ప్రాంతాల్లో వెటర్నరీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పరీక్షలను సేకరించి ల్యాబ్ కు పంపించగా బర్డ్ ఫ్లూ కారణంగానే కోళ్లు మరణించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పలు పౌల్ట్రీ ఫామ్ లను అధికారులు సీజ్ చేశారు. ఆయా ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.సిద్ధిపేట జిల్లాలోనూ బర్డ్ ఫ్లూ కలకలం చెలరేగింది. తోగుల మండలం కాన్గల్ లోని లేయర్ ఫామ్ లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కావడంతో వెటర్నరీ డిపార్ట్ మెంట్ రంగంలోకి దిగింది. ఫామ్ లో ఐదు షెడ్లలో ఉన్న మొత్తం 1.45లక్షల కోళ్లను చంపి పూడ్చి పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ప్రత్యేకంగా పది టీమ్స్ ను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్ లో ఒక వెటర్నరీ డాక్టర్, ఇద్దరు కాంపౌండర్లు, ఇద్దరు అటెండర్లను నియమించారు. పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది ఫామ్ లోకి వెళ్లి కోళ్లను చంపే పనిని మొదలు పెట్టారు.కాన్గల్ గ్రామం పరిధిలోని పౌల్ట్రీ ఫామ్ లో కోళ్లకు బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. ఆ గ్రామంలో మొత్తం 512 కుటుంబాలు, 2,400 జనాభా ఉండగా.. ఆశా వర్కర్లు బుధవారం 150 ఇండ్లలో సర్వే చేశారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి, జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. మరో రెండ్రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తిచేసి అకస్మాత్తుగా జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించనున్నారు.మెదక్ జిల్లాలో 44 లేయర్, బ్రాయిలర్ ఫామ్స్ ఉన్నాయి. వీటిల్లో 60లక్షల వరకు కోళ్లు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం కాన్గల్ గ్రామం పరిధిలోని పౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయింది. అయితే, ఆ గ్రామం పరిసరాల్లో ఐదు పౌల్ట్రీ ఫామ్స్ ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష కోళ్లను పెంచుతున్నారు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన ఫామ్ కు కిలో మీటర్ పరిధిలో ఉన్న ఫామ్స్ లో ఉన్న కోళ్లను చంపేస్తామని అధికారులు చెబుతుండటంతో పౌల్ట్రీ రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# మహిళలకు స్పెషల్ ఆఫర్..

## తక్కువ ధరలకు ఆటోలు



**హైదరాబాద్, ఏప్రిల్ 11, ( వెలుతురు)**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరుగుతోంది. సులభంగా డ్రైవింగ్ చేసే వీలుండడంతో మహిళలు సైతం వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎలక్ట్రిక్ ఆటో డ్రైవర్లుగా మహిళలు సైతం పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒమేగా సెకిల మొబిలిటీ కంపెనీ మహిళల కోసం ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పింక్ ఆటో రిక్షాలను చాలా తక్కువ ధరకే ఇస్తామని ప్రకటించింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా పింక్ ఆటో రిక్షాలను రూపొందిస్తున్నట్లు ఒమేగా సెకీ పేర్కొంది. దేశవ్యాప్తంగా మహిళా డ్రైవర్ల కోసం 2500 ఎలక్ట్రిక్ పింక్ ఆటో రిక్షాలను తక్కువ ధరలకే దశల వారీగా అందించనున్నట్లు తెలిపింది. తమ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈ పథకాన్ని ఢిల్లీలో ప్రారంభించినట్లు ఒమేగా సెకి తెలిపింది. అలాగే మహిళలకు ప్రభుత్వ బ్యాంకు నుంచి వెహికల్ లోన్ తీసుకుంటే వడ్డీలోనూ 1 శాతం రాయితీ సైతం లభిస్తుందని కంపెనీ తెలిపిందిమహిళా డ్రైవర్లకు తక్కువ ధరకే ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను అందించేందుకు తాము ఢిల్లీకి చెందిన లాభాపేక్ష లేని నారీ శక్తి సంస్థతో కలిసి పని చేస్తున్నామని ఒమేగా సెకి వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉదయ్ నారంగ్ తెలిపారు. కొన్ని నెలల్లో ఈ పథకాన్ని బెంగళూరు, ఉత్తర కర్ణాటక, చెన్నైల్లోనూ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎంపిక చేసిన మహిళలకు డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇస్తామని, దీని ద్వారా మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు.మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎలక్ట్రిక్ పింక్ ఆటో రిక్షా ధర ఢిల్లీలో ఆన్ రోడ్ ధర రూ.2,59,999గా ఉన్నట్లు ఒమేగా సెకి తెలిపింది. దీని కోసం ప్రభుత్వ బ్యాంకుల్లో లోన్ తీసుకుంటే 1 శాతం వడ్డీ రాయితీ సైతం లభిస్తుందని పేర్కొంది. సంప్రదాయ సీఎన్జీ ఆటో రిక్షాలతో పోలిస్తే ఈ సరికొత్త పింక్ ఆటోల నిర్వహణ ఖర్చు పావు వంతు మాత్రమే ఉంటుందని తెలిపింది. ఈ ప్రత్యేక కార్యక్రమం ముఖ్యంగా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంలో భాగంగా చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ముఖ్యంగా అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని మహిళలకు స్థిరమైన ఆదాయం వచ్చే జీవనోపాధి కల్పించాలని తక్కువ ధరకే ఆటోలు ఇస్తున్నట్లు పేర్కొంది.

# విభజన సమస్యలపై అడుగులు

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ( వెలుతురు)**

2014లో ఉమ్మడి ఏపీ విడిపోయి.. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన విషయం తెలిసిందే. అయితే.. ఆ తర్వాత.. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో.. విభజన చట్టంలోని చాలా సమస్యలు అపరిష్కృతంగానే ఉండి పోయాయి. అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా కేంద్రానికి పలు రూపాల్లో విన్నపాలు చేస్తూనే ఉన్నాయి. అయితే.. ఎట్టకేలకు.. తాజాగా కేంద్ర హోం శాఖ ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది.ముఖ్యంగా విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 9, 10లలోని సంస్థలు, ఆస్తుల విభజనపై కేంద్రం దృష్టి పెట్టింది. అదేసమయంలో ఉమ్మడి ప్రాజెక్టుల పూర్తికి కూడా.. ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో వడి వడిగానే ఈ సమస్యలు కొంతవరకైనా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత రెండు మాసాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆయా రాష్ట్రాల ప్రయోజనాలు పరిరక్షిస్తూనే.. విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారుఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతూ.. తాజాగా కేంద్ర హోం శాఖ నోట్ విడుదల చేసింది. షెడ్యూల్ 9లోని కార్పొరేషన్లు, కంపెనీల పంపకం అత్యంత కీలకంగా మారింది. అదేవిధంగా షెడ్యూల్ 10లోని సంస్థల విభజన(ఆర్టీసీ సహా ఇతర సంస్థలు)ను వేగంగా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే.. రెండు రాష్ట్రాల్లో చేపట్టిన వివిధ మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థల ప్రాజెక్టుల పురోగతిని కూడా కేంద్రం పరిశీలిస్తోంది.అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధుల విషయంపైనా కేంద్రం క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తోం ది. ఈ క్రమంలో ఏపీకి 350 కోట్లు, తెలంగాణకు 270 కోట్ల రూపాయలను ఇవ్వనుంది. దుగ్గరాజపట్టం వద్ద పోర్టు నిర్మాణానికి, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కూడా త్వరలోనే మార్గం సుగమం కానుందని అధికార వర్గాలు చెబుతున్నారు. సో.. ఎలా చూసుకున్నా.. సుదీర్ఘ విరామంతర్వాత.. రెండు రాష్ట్రాల విభజన చట్టంలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం రెడీ అయింది.

# అక్రమ వలసదారుల ఆస్తులు జప్తు

**వాషంగ్టన్, ఏప్రిల్ 10, ( వెలుతురు)**


గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదంలో అగ్రరాజ్యం ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు డొనాల్డ్ ట్రంప్. ఆయన జనవరి 20, 2025న బాధ్యతలు చేపట్టారు. దూకుడైన పాలన, సంచలన నిర్ణయాలతో అటు అమెరికన్లను, ఇటు ప్రపంచ దేశాలను భయపెడుతున్నారు. ఇప్పటికే వలసవాదులపై కఠిన ఆంక్షలు విధిస్తున్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు.డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో స్వీయ బహిష్కరణ (సెల్ఫ్ డిపోర్టేషన్) ద్వారా దేశం వీడాలని, లేకుంటే రోజుకు దాదాపు రూ.86,000 జరిమానాతో పాటు ఆస్తుల జప్తు, జైలు శిక్ష వంటి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తోంది. ఈ కథనం ట్రంప్ యంత్రాంగం యొక్క కొత్త విధానాలు, జరిమానా విధానం, సామాజిక-ఆర్థిక పరిణామాలను వివరిస్తుంది.హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం అక్రమ వలసదారులను స్వీయ బహిష్కరణకు ప్రోత్సహించేందుకుహెూమ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా నమోదు చేసుకొని దేశం వీడితే సురక్షితమని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని అధికార ప్రతినిధి ట్రిసియా మెక్‌లిన్ వెల్లడించారు. మార్చి 31న సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేసిన , తనిఖీల్లో పట్టుబడితే సంపాదించిన ఆస్తులు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ విధానం అక్రమ వలసదారుల్లో భయం కలిగించి, వారిని స్వచ్ఛందంగా దేశం వీడేలా చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది.ట్రంప్ పరిపాలన అక్రమ వలసదారులపై రోజుకు 998 డాలర్ల (సుమారు రూ.86 వేల) జరిమానా విధించే ఆదేశాలను జారీ చేసింది. సెల్ఫ్ డిపోర్టేషన్



యాప్‌లో నమోదు చేసుకొని దేశం వీడని వారిపై 1,000 నుంచి 5 వేల డాలర్ల వరకు జరిమానా విధించనున్నారు. ఈ జరిమానాలు చెల్లించకపోతే ఆస్తుల జప్తు, జైలు శిక్ష వంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక, బహిష్కరణ ఆదేశాలను ఉల్లంఘించిన వారు భవిష్యత్తులో అమెరికాకు తిరిగి రావడానికి అవకాశం కోల్పోతారని స్పష్టం చేసింది. ఈ చర్యలు అక్రమ వలసలను నియంత్రించడంలో భాగమని ట్రంప్ యంత్రాంగం పేర్కొంటోంది.ఈ జరిమానా విధానం 1996లో తీసుకొచ్చిన ఇమిగ్రేషన్ చట్టంలో భాగం. ట్రంప్ తన మొదటి పరిపాలనలో (2017-2021) ఈ చట్టాన్ని అమలు చేసి, తొమ్మిది మంది అక్రమ వలసదారులపై జరిమానాలు విధించారు. అయితే, కొన్ని కేసుల్లో ఈ జరిమానాలు ఉపసంహరించబడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బైడెన్ పరిపాలన ఈ జరిమానా విధానాన్ని నిలిపివేసింది. ఇప్పుడు ట్రంప్ మళ్లీ ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. ఇమిగ్రేషన్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ జరిమానాలు కోర్టులో సవాలు చేయడం సాధ్యమైనప్పటికీ, విజయం సాధించే అవకాశాలు తక్కువ. ఈ చర్యల ఉద్దేశం భయం కలిగించి వలసదారులను దేశం వీడేలా చేయడమేనని వారు అంచనా వేస్తున్నారు.ఈ కొత్త విధానాలు అమెరికాలోని అక్రమ వలసదారుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. అమెరికాలో సుమారు 1.1 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు అంచనా. వీరిలో చాలా మంది స్థానిక ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు, ముఖ్యంగా వ్యవసాయం, నిర్మాణం, సేవా రంగాల్లో. భారీ జరిమానాలు, బహిష్కరణ భయం వల్ల వీరు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది, దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం పడవచ్చు. అంతేకాక, ఈ చర్యలు మానవ హక్కులపై చర్చను రేకెత్తించాయి, వలసదారుల సమాజంలో భయాందోళనలను పెంచుతున్నాయి.ట్రంప్ యొక్క ఈ విధానాలు అంతర్జాతీయ సమాజంలోనూ చర్చనీయాంశంగా మారాయి. లాటిన్ అమెరికా, ఆసియా దేశాల నుంచి వచ్చిన వలసదారులు ఎక్కువగా ఉండటంతో, ఈ దేశాల ప్రభుత్వాలు తమ పౌరుల రక్షణ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, మెక్సికో వంటి దేశాలు బహిష్కరణకు గురైన వలసదారుల కోసం తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ విధానాలు మరింత కఠినతరం కావచ్చని, దీనివల్ల అమెరికా-ఇతర దేశాల మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం పడవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ట్రంప్ యంత్రాంగం అక్రమ వలసలపై చూపిస్తున్న ఈ దూకుడు విధానం దేశ భద్రత, చట్టపాలనను కాపాడేందుకని అధికారులు పేర్కొంటున్నప్పటికీ, దీని వెనుక రాజకీయ, సామాజిక ఉద్దేశాలు ఉన్నాయని విమర్శకులు అంటున్నారు. భారీ జరిమానాలు, ఆస్తుల జప్తు వంటి చర్యలు వలసదారులను భయపెట్టి స్వచ్ఛంద బహిష్కరణకు ఒత్తిడి చేసే వ్యూహంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ విధానాలు దీర్ఘకాలంలో ఆర్థిక, మానవీయ సవాళ్లను తెచ్చిపెట్టవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసదారుల సమస్యను పరిష్కరించాలంటే కేవలం జరిమానాలు, బహిష్కరణల కంటే సమగ్రమైన, మానవీయ విధానం అవసరమని సమాజంలో ఒక వాదన బలంగా వినిపిస్తోంది.

# సెట్టింగ్స్ మారిస్తే సైబర్ క్రైమ్ కు దూరం

**హైదరాబాద్, ఏప్రిల్ 11, ( వెలుతురు)**





కొంతకాలంగా ఆన్‌లైన్ మోసాల కేసులు వేగంగా పెరుగుతున్నాయి. సైబర్ నేరస్థులు ఎక్కువగా వాట్సాప్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇక్కడ నకిలీ సందేశాలు, ఫిషింగ్ లింక్‌లు, కాల్‌ల ద్వారా అమాయక ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ మీరు అస్సలు ఆందోళన చెందకూడదు. వాట్సాప్‌లో కొన్ని ప్రైవసీ సెట్టింగ్‌లను ఆన్ చేయడం ద్వారా మీరు ఈ ఆన్‌లైన్ మోసాలను నివారించవచ్చు. మీరు ఇప్పుడే ఆన్ చేయవలసిన ప్రత్యేక సెట్టింగ్‌ల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.మీ ప్రొఫైల్ చిత్రాన్ని చూసి కూడా చాలా మంది స్కామర్లు మిమ్మల్ని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అంతేకాదు మీ ఫోటోను కూడా దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. అందుకే మీ ప్రొఫైల్ చిత్రాన్ని ఎప్పుడు తెలియని వ్యక్తులకు కనిపించకుండా మీ ప్రొఫైల్ లో ఉన్నవారు మాత్రమే చూసేలా సెట్ చేయాలి. దీన్ని మార్చడానికి, ముందుగా మీరు సెట్టింగ్‌లు ∩ ప్రైవసీ ∩ ప్రొఫైల్ ఫోటోకి వెళ్లాలి. అక్కడ ఓన్లీ మై కాంటాక్ట్స్ మీద క్లిక్ చేయండి.మీరు లాస్ట్ సీన్ వివరాలు, ఎబౌట్ లను వాట్సాప్‌లో అందరికీ ఓపెన్ చేసి ఉంచితే స్కామర్లు మీ కార్యాచరణను ట్రాక్ చేయవచ్చు. అవును, ఈ రోజు ఆ వ్యక్తి ఎప్పుడు ఆన్‌లైన్‌లోకి వచ్చాడనే దాని గురించి సమాచారం పొందడానికి ఇలాంటి యాప్‌లు చాలా అందుబాటులో ఉన్నాయి. దీనితో, స్కామర్లు మీరు ఏ సమయంలో ఎక్కువగా యాక్టివ్‌గా ఉంటారు? మిమ్మల్ని ఎప్పుడు లక్ష్యంగా చేసుకోవడం ఉత్తమం వంటి ప్లాన్ లు వేసుకుంటారు. కాబట్టి, ‘లాస్ట్ సీన్’ ‘ఎబౌట్’ లను ఆఫ్ చేయండి.ఈ జాబితాలో ఇది అతి ముఖ్యమైన సెట్టింగ్, దీనిని మీరు అస్సలు లైట్ తీసుకోవద్దు. నిజానికి, మీరు ఈ సెట్టింగ్‌ని ఆన్ చేసిన తర్వాత, మీ అనుమతి లేకుండా ఎవరూ మీ వాట్సాప్‌ను ఉపయోగించలేరు. ఈ సెట్టింగ్‌ని ఆన్ చేయడం ద్వారా, ఎవరైనా మీ ఓటీపీని తీసుకోవాలి అనుకున్నా సరే వారు మీ వాట్సప్ ఖాతాను ఉపయోగించలేరు. మీ ఖాతాలోకి లాగిన్ అవ్వడానికి ఓటీపీ తర్వాత 6 అంకెల పిన్‌ను నమోదు చేయమని స్కామర్ మిమ్మల్ని అడుగుతాడు. అయితే ఈ సెట్టింగ్‌ను ఆన్ చేయడానికి, ముందుగా వాట్సాప్ సెట్టింగ్‌లకు వెళ్లండి. దీని తరువాత, సెట్టింగ్‌లలో ప్రైవసీ ∩ డబుల్ వెరిఫికేషన్ పై క్లిక్ చేయండి. ఇక్కడ మీరు 6 అంకెల పిన్ సెట్ చేసుకోవచ్చు. అంతేకాదు ఇప్పుడు మీరు మీ ఇమెయిల్ ఐడిని ఇక్కడ యాడ్ చేయాలి. తద్వారా మీరు పిన్‌ను మరచిపోతే దాన్ని మళ్ళీ రీసెట్ చేయవచ్చు.కొంతకాలంగా, స్కామర్లు మొదట మీ ప్రయోజనాల గురించి పెద్ద పెద్ద విషయాలు చెప్పే గ్రూపులో చేర్చుతారు. కానీ మీరు వారి ఉచ్చులో పడితే, అది మీ బ్యాంక్ ఖాతాను కూడా ఖాళీ చేస్తుంది. అందువల్ల, మిమ్మల్ని ఎవరు గ్రూప్ లో యాడ్ అవమని అడిగినా సరే అవద్దు. దీన్ని మార్చడానికి, మీరు వాట్స్ ప్ సెట్టింగ్‌లు ప్రైవసీ గ్రూప్‌లకు వెళ్లాలి. ఇప్పుడు ఇక్కడ కాంటాక్ట్స్ లో ఉన్న వారికి మాత్రమే అనే ఆప్షన్ ను క్లిక్ చేయండి.

# రామగుండంలో భూ కంప ప్రమాదం

**అదిలాబాద్, ఏప్రిల్ 11, ( వెలుతురు)**

ఇదేమీ జనాలను భయపెట్టడానికి.. కంగారు పెట్టడానికి చెబుతున్న విషయం కాదు. చాలా రకాల పరిశీలనలు, అంచనాల తర్వాత తేల్చిన సంగతి ఏంటంటే.. కొద్దిరోజుల్లో తెలంగాణ ఓ భూకంపాన్ని ఎదుర్కోబోతోంది. భూకంప జోన్‌లో ఉన్న రామగుండంలో భూమి ప్రకంపనలు రావొచ్చని ఎపిక్ సంస్థ అంచనా వేసింది. కొద్ది రోజుల్లో రామగుండం సమీపంలో 5 మాగ్నిట్యూడ్‌తో ఈ భూకంపం రావొచ్చని లెక్కలు వేసింది.తెలంగాణలోని సింగరేణి ప్రాంతంలో భూకంపాలకు అవకాశం ఉంటుందని ఎప్పటి నుంచో అధ్యయనాలున్నాయి. రాష్ట్రంలో భూకంప సంభావ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతం రామగుండం, గోదావరి ఖని ప్రాంతాలు. ఇప్పుడు అక్కడ త్వరలోనే ఓ మధ్యస్థాయి భూకంపం వస్తుందని Epic చెబుతోంది. ఈ సంస్థ కొంతమంది భూకంప అధ్యయన ఔత్సాహికులు నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి వాళ్లు భూకంపాలపై మందస్తు అంచనాలను ఇస్తుంటారు.ప్రపంచ వ్యాప్తంగా చాలా సంస్థలు తమకు అందుబాటులో ఉన్న సాంకేతికత సాయంతో భూకంపాలను ముందే అంచనా వేస్తుంటాయి. మన దేశంలో ఎన్ జీఆర్ ఐఇతర సంస్థలు ఆ పనిచేస్తున్నాయి. %జుజూఅఎ% కూడా అలాంటిదే కానీ ఇది ప్రభుత్వ సంస్థనో, లేక ఓ భారీ పరిశోధనా సంస్థనో కాదు. చదువుకున్న శివ సీతారామ్ అనే భూకంప అధ్యయన ఔత్సాహికుడు దీనిని ప్రారంభించారు. కొంతమంది వాలంటరీగా ఆయనకు సహకారం అందిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా భూకంపాల ప్రిడిక్షన్ ను ఈ వేదిక ద్వారా ప్రకటించారు. వాటిలో చాలా వాటిని కచ్చితమైన నిర్ధారణ చేశారు. 2004 సునామీ చూసిన సీతారామ్‌కు భూకంపాలపై అధ్యయనం చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆయనే సొంతంగా పరిశోధనలు ప్రారంభించి ఓ అల్గారిథమ్ కనుక్కొన్నారు. దాని ప్రకారం అంచనాలు ఇస్తుంటారు. వాటిని www.seismo.in వైబ్‌సైట్‌లో ప్రచురిస్తున్నారు. వీటిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు Epic పేరుతో ట్విటర్ అకౌంట్‌ను ప్రారంభించారు. “ ఏప్రిల్ 10-17 వ తేదీల మధ్య రామగుండం సమీపంలో 5 మాగ్నిట్యూడ్‌తో భూకంపం రావడానికి అవకాశం ఉంది.” అని



ఆయన ఏబీపీ దేశంతో చెప్పారు.2021 నుంచి ఇప్పటి వరకూ 22 భూకంపాలను వీళ్లు కచ్చితంగా అంచనా వేయగలిగారు. మొన్న జరిగిన మయన్మార్ భూకంపాన్ని కూడా కచ్చితమైన అంచనాతో చెప్పారు. సాధారణంగా వీళ్ల ప్రిడిక్షన్స్ భూకంప భూకంప కేంద్రం అన్నది 300కిలోమీటర్లు, భూకంప తీవ్రత 1- 1.5 మాగ్నిట్యూడ్ తేడా ఉంటుంది. అలాగే భూకంప సమయం కూడా 2 -3 నెలల వరకూ తేడా ఉండొచ్చు. మయన్మార్ లో ఫిబ్రవరి 28న భూకంపం వస్తుందని అంచనా వేయగా.. మార్చి 28న వచ్చింది. 6.5 మాగ్నిట్యూట్ అని అంచనా ఇస్తే.. 7.7 తీవ్రతతో వచ్చింది.భూకంపాల అంచనాల్లో మాకు 18 శాతం సక్సెస్ రేట్ ఉంది. ఇలాంటి పరిశోధనలు, విశ్లేషణల్లో ఇది కచ్చితంగా మెరుగైన ఫలితమే. మాకున్న వనరులు తక్కువ. మేం సొంతగా తయారు చేసుకున్న అల్గారిథమ్ వల్ల అంచనా వేయగలుగుతున్నాం. అంచనా కోసం చాలా పారామీటర్లు తీసుకుంటాం. సోలార్ రేడియేషన్, ఎలక్ట్రోమాగ్నిటిక్ వేవ్స్, అట్మాస్ఫియర్ డేటా, వెదర్ మోడల్స్ ఇలా రకరకాల పారామీటర్స్ ద్వారా అంచనా వేస్తాం. అని సీతారామ్ చెప్పారు. “వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే రామగుండంలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. మేం ఈ వారంలోనే రావొచ్చు అనుకుంటున్నాం. తీవ్రత విషయంలోనూ.. టైమ్ విషయంలోనూ కొంత తేడా ఉండొచ్చు” కేవలం రామగుండం మాత్రమే కాదు.. దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం ధర్మశాలకు కూడా ముప్పు ఉందని వీరు సూచిస్తున్నారు. 120 ఏళ్ల క్రితం హిమాలయాల్లోని కాంగ్రా ప్రాంతంలో భారీ భూకంపం వచ్చింది. మరికొద్ది రోజుల్లో అదే ప్రాంతంలోని ధర్మశాలలో 7 మాగ్నిట్యూడ్‌తో ఓ భారీ భూకంపం వచ్చే అవకాశం కూడా ఉందని సీతారామ్ చెబుతున్నారు. భూకంపాల గురించి జనాలను భయపెట్టాలన్నది తమ ఉద్దేశ్యం కాదని.. దీని ద్వారా ప్రజలు అప్రమత్తం కావొచ్చని సీతారామ్ చెప్పారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో 4 మాగ్నిట్యూడ్ కంటే ఎక్కువగా తీవ్రత నమోదయ్యే పక్షంలో ప్రజలను హెచ్చరించే వ్యవస్థలు అభివృద్ధి చేశారని అలాంటివి రావాలన్న ఉద్దేశ్యంతోనే ముందస్తు అంచనాలు ఇస్తున్నామన్నారు.దక్కన్ పీఠభూమిలో ఉన్న తెలంగాణలో భూ పలకల రాపిడి వలన, గోదావరి ఫాల్ట్ లైన్స్ వల్ల భూకంపాల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. చాలా తక్కువ తీవ్రత గల భూకంపాలు తరుచుగా వస్తూనే ఉంటాయి. అవి వచ్చినట్లు కూడా తెలియదు. తెలంగాణలో 50ఏళ్లలో అతిపెద్ద భూకంపం 4 డిసెంబర్ 2024న వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. వరంగల్ కు ఈశాన్యంగా 85కిలోమీటర్లు, హైదరాబాద్‌కు ఈశాన్యంగా 218 దూరంలో ములుగు సమీపంలోని భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించింది. తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం అని చెప్పుకోవచ్చు.హైదరాబాద్ నుంచి 300కిలోమీటర్ల పరిధి తీసుకుంటే గడచిన 10ఏళ్లలో 12 భూకంపాలు 4 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్నవి నమోదయ్యాయి. గడచిన 50ఏళ్లలో తీసుకుంటే 5 తీవ్రతకు మించి వచ్చిన భూకంపం కిందటి డిసెంబర్‌లో ముల్గుగులో వచ్చింది.57 ఏళ్ల కిందట భద్రాచలంలో అతిపెద్ద భూకంపం వచ్చింది. ఏప్రిల్ 13, 1969 న రాత్రి 9గంటల ప్రాంతంలో 5.7 మాగ్నిట్యూడ్‌తో వచ్చిన ఈ భూకంప కేంద్రాన్ని భద్రాచలానికి 14.2 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. అయితే 20 కిలోమీటర్ల లోతున రావడంతో ప్రభావం తక్కువగా ఉంది. 1969లో వచ్చిన భూకంపానికి సంబంధించి ప్రాణనష్టం జరిగినట్లుగా గుర్తించలేదు. ఇప్పుడు రామగుండంలో 5 తీవ్రతతో రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అంచనా నిజం కావొచ్చు%ొ% కాకపోవచ్చు. అలాగే ఆ భూకంప తీవ్రత తగ్గనూ వచ్చు.. లేదా పెరగొచ్చు. కేవలం వీళ్ల అల్గారిథమ్ ప్రిడిక్షన్ ను ఆధారంగా చేసుకునే ఈ అంచనాలు ఇచ్చారు.

# విశాఖ మేయర్ పీఠం పోరు

- 19వ తేదీన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం
- పోటాపోటీగా వైకాపా, టిడిపిల క్యాంపులు
- విదేశాలకు తరలిన కార్పోరేటర్లు

**విశాఖపట్టణం,ఏప్రిల్10( వెలుతురు):**

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయాలు అనూహ్యమైన మలుపులు తిరుగుతున్నాయి. పోటాపోటీ క్యాంప్ లు నడుపుతున్న టీడీపీ, వైసీపీలు శిబిరాలను విదేశాలకు తరలించాయి. దీంతో మేయర్ హరి వెంకట కుమారి అవిశ్వాస పరీక్ష చుట్టూ ఉత్కంఠ రెట్టింపైంది. గ్రేటర్ మేయర్ పీఠంపై కన్నేసిన టీడీపీ నో కాన్ఫిడెన్స్ నోటీసులు ఇచ్చింది. ఈ మేరకు ఏప్రిల్ 19వ తేదీన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఎక్స్ ఆఫీస్ లో కలిపి మ్యాజిక్ ఫిగర్ 74 కాగా.. గ్రేటర్‌లో బలాబలాలపై కూటమి, వైసీపీ ఎవరి లెక్కలు వాళ్లవి.. బీజేపీ, జనసేనతో కలిసి తమ బలం 61కి పెరిగిందని.. మేయర్ పదవి దక్కించుకోవడం ఖాయం అనే ధీమా టీడీపీలో కనిపిస్తోంది.. అయితే, ఈ నెంబర్ గేమ్ ను వైసీపీ పట్టించుకోవడం లేదు. ఎక్స్ ఆఫీషియోతో కలిపి తమ సంఖ్యా బలం 37గా లెక్కేసుకుని అవిశ్వాసం వీగిపోవడం ఖాయం అనే అంచనాకు వచ్చింది. అటు-, కూటమి.. ఇటు వైసీపీ రెండు చాలా కాన్ఫిడెంట్ గా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగానే తన కార్పొరేటర్లను బెంగుళూరు తరలించేసింది. సమయం దగ్గర పడుతున్న తరుణంలో అనూహ్యంగా శిబిరాన్ని శ్రీలంకకు మార్చేస్తోంది. అందరూ కాల్పోయినా కొంత మందిని షిఫ్ట్ చేయడం అనివార్యంగా భావించినట్టు- తెలిసింది. అదే




సమయంలో వైసీపీలో గెలిచి ఇటీ-వలకూటమిలో చేరిన కార్పొరేటర్లతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం వున్న లెక్క ప్రకారం కూటమికి ఇద్దరు సభ్యులు అవసరం వుంది. దీంతో వైసీపీ పూర్తి స్థాయి వ్యూహం పన్ని అమలు చేస్తోంది. మరోవైపు, సంఖ్యాబలం కాపాడుకోవడం ఇప్పుడు కూటమికి పెద్ద టాస్క్. దీంతో కొన్నిరోజులుగా భీమిలిలో నడుస్తున్న క్యాంప్ ను మలేషియాకు తరలించింది. తొలి ప్రయత్నంలో 26 మంది విదేశాలకు జంప్ అయ్యారు. నిజంగానే మేయర్ ను దించే సంఖ్యాబలం ఉంటే విదేశాల్లో శిబిరాలు ఎందుకో చెప్పాలని వైసీపీ ప్రశ్నిస్తోంది. మేయర్ పై అవిశ్వాసం ప్రకటించిన కూటమి.. ఇప్పుడు డిప్యూటీ-మేయర్ కు నోటీ-సులు ఇచ్చింది. డిప్యూటీ మేయర్ శ్రీధర్ ను తప్పించాలని భావిస్తుండగా.. జనసేన ఓటు కీలకంగా మారింది.. మొత్తం పార్టీకి 11మంది సభ్యులు ఉండగా.. క్యాంప్ రాజకీయాలు వద్దని హైకమాండ్ వారించినట్టు తెలిసింది. అయితే, మేయర్ పై అవిశ్వాసం ఆషామాషీ వ్యవహారం కాదని అర్థం కావడంతో అధికార, విపక్షాలు వ్యూహాలు రాటుదేలుతున్నాయి.

# రజతోత్సవ సభకు 3వేల బస్సులు



**వరంగల్,ఏప్రిల్ 11, ( వెలుతురు)**

ఈనెల 27న వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగాల్సి ఉంది. ఈ సభ ద్వారా మరోసారి గులాబి శ్రేణుల్లో ఉత్సాహం తేవాలి చూస్తున్నారు కేసీఆర్. కానీ అది అసాధ్యం అనిపిస్తోంది. సభకు రోజులు దగ్గరపడినా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం లేదు. కేవలం బీఆర్ఎస్ హడావిడి మాత్రం కనపడుతోంది. రోజుకి ఒక జిల్లా నేతలతో ఫామ్ హౌస్ లో కేసీఆర్ సమావేశం అవుతున్నారు. పార్టీ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు. నేతలు వెళు_న్నారు, వస్తున్నారు, కేసీఆర్ మాటలు వింటున్నారు కానీ.. సభపై ఎవరికీ ఉత్సాహం లేదని మాత్రం తెలుస్తోంది.అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ సభలకోసం విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసిందని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. బీఆర్ఎస్ ని పొరుగు రాష్ట్రాల్లో విస్తరించేందుకు, అప్పట్లో బస్సు యాత్రలు చేసిన కేసీఆర్.. సీఎం హోదాలో ఆ యాత్రలను చేపట్టారు. ప్రభుత్వ ఖజానా నుంచే సొమ్ము చెల్లించి పార్టీకి సోకులు చేసుకున్నారని తెలుస్తోంది. తాజాగా బీఆర్ఎస్ సభకోసం చేస్తున్న ఖర్చుపై కూడా సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. పార్టీ సభ కోసం తెలంగాణ ఆర్టీసీ నుంచి 3 వేల బస్సులకోసం 8 కోట్ల రూపాయలు బీఆర్ఎస్ అడ్వాన్స్ గా ఇచ్చిందనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇదంతా ఎవడబ్బ సొమ్మంటూ కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా అకౌంట్ల నుంచి కౌంటర్లు పడుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న సొమ్ముని ఇప్పుడిలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని అంటున్నారు.

**పింక్ పార్టీ సభ కోసం 8 కోట్ల రూపాయలతో బస్సులా?**


**ఏం కష్టం చేసి ఇన్ని కోట్లు సంపాదించిన్రురా పింకీస్?**

బీఆర్ఎస్ రజతోత్సవ సభకోసం ఇటీవల వెరైటీ ప్రచారం మొదలు పెట్టారు. కీలక నేతలంతా గోడలపై వాల్ పెయింట్స్ వేస్తూ ప్రచారం మొదలు పెట్టారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా గోడలపై కుంచె పట్టి కేసీఆర్ పేరు రాశారు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. దొరల వద్ద తన ఆత్మాభిమాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ తాకట్టు పెట్టారని, ఒక జాతీయ పార్టీకి తెలంగాణ రాష్ట్ర అధినేతగా ఉన్న ఆయన, చివరకు కేసీఆర్ తో చేతులు కలిపి ఆయన భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు నెటిజన్లు.బీఆర్ఎస్ అధికారంలో ఉంటే రజతోత్సవ సభ పెద్ద ఎత్తున జరిగేది. అయితే ఇప్పుడు పార్టీ ప్రతిపక్షంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ని దూరం పెట్టిన ప్రజలు, లోక్ సభ ఎన్నికల్లో అసలు పట్టించుకోలేదు. దీంతో ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న క్రెడిబిలిటీ ఏంటో స్పష్టమైపోయిందని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. రజతోత్సవ సభ అంటూ జనంలోకి వచ్చినా, సభా వేదికపై కేసీఆర్ రెచ్చిపోయినా ఎవరూ నమ్మే పరిస్థితి లేదంటున్నారు. 2023 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సభలకు జనాల్ని పోగు చేశారు, సభలు విజయవంతం అయ్యాయని చెప్పుకున్నారు, కానీ సభలకు వచ్చిన జనం బీఆర్ఎస్ కి మాత్రం ఓట్లు వేయలేదు. సభలకు హాజరైన వారిని చూసి, ఫలానా అభ్యర్థి విజయం ఖాయం అని అక్కడికక్కడే చెప్పేసిన కేసీఆర్, తాను పోటీ చేసిన స్థానంలోనే ఓడిపోవడంతో షాకయ్యారు. చాన్నాళ్లుగా ఆయన ప్రజలకు దూరంగా ఫామ్ హౌస్ లోనే ఉంటున్నారు. అసెంబ్లీకి వచ్చినా మొక్కుబడిగా మాట్లాడి వెళ్లిపోయారు. కనీసం ఈ సభలో అయినా నిజాలు మాట్లాడతారా..? గతంలో చేసిన తప్పుల్ని ఒప్పుకుంటారా..? ప్రజలు తమని ఎందుకు దూరం పెట్టారనే విషయాన్ని పరిగణలోకి తీసుకుంటారా..? వేచి చూడాలి.

# ఎన్ ఐఏ అధికారుల అదుపులో రాణా

**ముంబై, ఏప్రిల్ 11, ( వెలుతురు)**

ముంబైలో జరిగిన 26/11 ఉగ్రవాద దాడులకు ప్రధాన సూత్రధారి, ఉగ్రవాది తహవ్వూర్ హుస్సేన్ రాణా ఎట్టకేలకు భారతదేశానికి తిరిగి వచ్చాడు. భారతదేశానికి చేరుకున్న తర్వాత అతన్ని కోర్టులో హాజరుపరిచారు. పాటియాలా హౌస్ కోర్టు రాణాను 18 రోజుల రిమాండ్‌కు పంపింది. ఐఎస్ఐలో పనిచేసి, లష్కరే తోయిబా, హర్కత్-ఉల్-జిహాదీ ఇస్లామీ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధం కలిగి ఉన్న తహవ్వూర్ రాణాను ప్రత్యేక విమానంలో భారతదేశానికి తీసుకువచ్చారు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో భారతదేశానికి చేరుకున్న రాణాను.. అధికారికంగా అరెస్టు చేసింది.రాణాను పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచింది. ఈ సమయంలో, ముంబై దాడులలో అతని ప్రమేయానికి సంబంధించిన ఆధారాలను కోర్టులో సమర్పించారు. 26/11 ముంబై దాడులకు సంబంధించి రాణా పంపిన ఈమెయిల్స్ సహా కేసుతో సంబంధం ఉన్న బలమైన ఆధారాలను పాటియాలా హౌస్ కోర్టుకు సమర్పించింది. ఉగ్ర కుట్రను వెలికితీయడానికి కస్టోడియల్ విచారణ చాలా కీలకమని కోర్టుకు తెలిపింది. ఉగ్రవాద దాడులను నిర్వహించడంలో రాణా పాత్రపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు జరపనున్నారు.పాకిస్తాన్‌లో జన్మించిన కెనడియన్ పౌరుడు తహవ్వూర్ హుస్సేన్ రాణా 26/11 ముంబై ఉగ్రవాద దాడుల్లో కీలక నిందితుడు గురువారం(ఏప్రిల్ 10) అమెరికా నుండి రహస్యంగా చార్టర్డ్ బిజినెస్ జెట్‌లో న్యూఢిల్లీకి తీసుకువచ్చారు. మీడియా కథనాల ప్రకారం, ఈ అప్పగింత ఆపరేషన్ గల్ఫ్‌స్ట్రీమ్ %+%550 ఉపయోగించి జరిగింది. ఈ విమానాన్ని వియన్నాకు చెందిన చార్టర్ సర్వీస్ నుండి అద్దెకు తీసుకున్నారు. ఈ జెట్ బుధవారం స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.15 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 11.45 గంటలకు)




ఫ్లోరిడాలోని మయామి నుండి బయలుదేరింది. అదే రోజు స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు) రొమేనియాలోని బుకారెస్ట్‌లో అది ల్యాండ్ అయింది. దాదాపు 11 గంటల పాటు రొమేనియన్ రాజధానిలో నిలిపివేశారు. గల్ఫ్‌స్ట్రీమ్ గురువారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.15 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 8.45) బుకారెస్ట్ నుండి బయలుదేరి నేరుగా న్యూఢిల్లీకి బయలుదేరింది. అక్కడ గట్టి భద్రత మధ్య ల్యాండ్ అయింది. రాణా ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే, జాతీయ దర్యాప్తు సంస్థ అతన్ని అధికారికంగా అరెస్టు చేసింది.భారత దర్యాప్తు సంస్థ ఎన్ ఐ ఏ 2011 సంవత్సరంలో తహవ్వూర్ రాణాపై తన చార్జిషీట్ దాఖలు చేసింది. దీని తరువాత, 2019 డిసెంబర్ 4న మొదటిసారిగా, దౌత్య మార్గాల ద్వారా రాణాను అప్పగించాలని భారతదేశం డిమాండ్ చేసింది. జూన్ 10, 2020న రాణాను తాత్కాలికంగా అరెస్టు చేయాలని డిమాండ్ చేయగా, జూన్ 22, 2021న అమెరికా ఫెడరల్ కోర్టులో తహవ్వూర్ రాణాను అప్పగించడంపై విచారణ సందర్భంగా భారతదేశం ఆధారాలను సమర్పించింది.రెండు సంవత్సరాల క్రితం, మే 16, 2023న, కాలిఫోర్నియా జిల్లా కోర్టు అతన్ని అప్పగించాలని ఆదేశించింది. దీని తరువాత, తహవూర్ అమెరికాలోని అనేక కోర్టులలో అప్పీల్ దాఖలు చేశాడు. కానీ అతని పిటిషన్లన్నీ తిరస్కరించారు. రెండు దేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం అతన్ని భారతదేశానికి పంపవచ్చని కోర్టు తన నిర్ణయంలో పేర్కొంది. గత సంవత్సరం, రాణాను అప్పగించాలన్న భారతదేశం చేసిన అభ్యర్థనకు అమెరికా ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. నవంబర్ 13న, రానా సుప్రీంకోర్టులో రిట్ ఆఫ్ సర్టియోరారీ కోసం పిటిషన్ దాఖలు చేశాడు. కానీ అది తిరస్కరణకు గురైంది. ఫిబ్రవరి 27న, అతను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎలెనా కగన్ మార్చి 6న తిరస్కరించారు. ఈ తుది నిర్ణయం తర్వాత, రాణాను భారతదేశానికి తీసుకువచ్చారు.తహవ్వూర్ రాణా భారతదేశానికి చేరుకున్న వెంటనే, అతన్ని అరెస్టు చేశారు. ఆ తర్వాత అతన్ని కోర్టులో హాజరుపరిచింది. ఈ సమయంలో, ముంబై దాడులలో అతని ప్రమేయానికి సంబంధించిన ఆధారాలను కోర్టులో సమర్పించారు. రాణా తరపు న్యాయవాది పీయూష్ సచ్‌దేవా కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టును 20 రోజుల రిమాండ్ కోరింది. గంటల తరబడి మూసి తలుపుల మధ్య జరిగిన చర్చల తర్వాత, తెల్లవారుజామున 2:10 గంటలకు కోర్టు 18 రోజుల రిమాండ్ మంజూరు చేస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఆ వెంటనే రాణాను ప్రధాన కార్యాలయానికి తరలించారు

## విద్యాహక్కు చట్టం అమలుపై విచారణ

**హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):**

విద్యాహక్కు చట్టం అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు- పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు- పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

## మాతృభాషకు విద్యార్థులను దూరం చేయొద్దు

- ఎక్స్‌లో పోస్ట్ చేసిన వెంకయ్యనాయుడు



**హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):**

తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు విని విచారించానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మార్కుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. విద్యార్థులను మన మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదు. సంస్కృతాన్ని బోధించడంలో తప్పు లేదు.. అదే సమయంలో మనదైన సంస్కృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుంది. అందుకే జాతీయ విద్యావిధానం - 2020 సైతం దానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## 2026 తెలుగు హీరోలదే హవా



**హైదరాబాద, ఏప్రిల్ 11, ( వెలుతురు)**

ఇప్పటివరకు తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న చాలామంది నటులు వాళ్ళను వాళ్ళు స్టార్లుగా ఎస్టాబ్లిష్ చేసుకోవడానికి అహర్నిశలు ప్రయత్నమైతే చేస్తున్నారు. ఇక పాన్ ఇండియాలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నెంబర్ వన్ పొజిషన్ కి చేరుకుంటుంది అంటూ మన హీరోలు చాలా కాన్ఫిడెంట్ ను వ్యక్తం చేస్తున్నారు. రాబోయే వరుస సినిమాలతో భారీ విజయాలను అందుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లుగా తెలుస్తోంది.. సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రతి హీరో కూడా ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు. ఒక్కో హీరో చేతిలో రెండు మూడు ప్రాజెక్టులు ఉండడమే కాకుండా మరికొన్ని కథలను వింటూ వాళ్ళందరిని లైన్ లో పెట్టే ప్రయత్నమైతే చేస్తున్నారు. ఇక దాదాపు రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు మన స్టార్ హీరోలందరు బిజీగా ఉన్నారు. ఇక వరుసగా వాళ్ళు కమిట్ అయిన సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతూ తమదైన రీతిలో సత్తా చాటుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఇక 2026వ సంవత్సరంలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చే సినిమాలు పాన్ ఇండియాను షేక్ చేయబోతున్నాయి అంటూ కొంతమంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. నిజానికి 2026 వ సంవత్సరంలో ఏ సినిమాలు వస్తున్నాయి అనేది మనం ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.2026 సంవత్సరం ప్రారంభం లో సంక్రాంతి కానుకగా మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న సినిమాను రిలీజ్ చేస్తున్నారు. కాబట్టి ఈ సినిమాతో స్టార్టింగ్ లోనే భారీ విజయాన్ని దక్కించుకొని సినిమా ఇండస్ట్రీకి మంచి బూస్టప్ ని ఇవ్వాలనే ఉద్దేశ్యంలో దర్శకుడు అనిల్ రావిపూడి, చిరంజీవి ఉన్నట్టుగా తెలుస్తోంది.. ఇక ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాను కూడా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమా ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో పెను రికార్డులను క్రియేట్ చేస్తూ ముందుకు సాగుతుందని సినిమా మేకర్స్ మంచి కాన్ఫిడెంట్ తో ఉన్నారు%ొ%ఇక మార్చి లో రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు డైరెక్షన్ లో వస్తున్న 'పెద్ది' సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇక దాంతోపాటుగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న 'ప్యారడైజ్' సినిమాని కూడా రిలీజ్ చేస్తుండడం విశేషం%ొ%ఇక ఈ రెండు సినిమాల మీద భారీ బజ్ అయితే ఉంది..2026 సమ్మర్ కానుకగా ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న 'ఫౌజీ ' సినిమాని తీసుకొస్తున్నారు. ఇక ఇయర్ ఎండింగ్ లో అల్లు అర్జున్ హీరోగా అట్లీ డైరెక్షన్ లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక మొత్తానికైతే 2026వ సంవత్సరంలో మన స్టార్ హీరోలందరు భారీ విజయాలను సాధించి పాన్ ఇండియాని షేక్ చేయాలని చూస్తున్నారు.ఇక ఒకరి తర్వాత ఒకరు కలెక్షన్ల సునామీని సృష్టించి తెలుగు సినిమా స్థాయి ఏంటో ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడానికి సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది.. మొత్తానికైతే మూవీ లవర్స్ కి 2026వ సంవత్సరం మంచి ఎంటర్ టైన్ మెంట్ ను ఇవ్వబోతుందనేది మాత్రం చాలా స్పష్టంగా తెలుస్తోంది.


## వేంపాడు గ్రామంలో హెూం మంత్రి అనిత మార్నింగ్ వాక్



**అనకాపల్లి ఏప్రిల్ 11, ( వెలుతురు)**

నక్కపల్లి మండలం వేంపాడులో హెం మంత్రి అనిత శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ చేసారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి,నివాళులు అర్పించారు. వాకింగ్ చేస్తూ ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మార్నింగ్ వాక్ లో అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వేంపాడు ప్రజలుఅడుగడుగున మంత్రికి హారతులతో స్వాగతం పలికారు. వేంపాడులో సీసీ రోడ్డు అవసరమని మంత్రి గుర్తించారు. వేంపాడు రామాలయం వీధిలో సీసీ రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు.

# మే 9ననే హరిహరవీరమల్లు విడుదల




## ర్యూమర్స్‌కు చెక్ పెట్టిన మూవీ మేకర్స్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ కానుంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల అవుతున్నట్లు- ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అయితే హరిహర వీరమల్లు విడుదల ఆలస్యం కానున్నట్లు- కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ రూమర్స్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. మే 9న హరిహర వీరమల్లు సినిమాను విడుదల చేయనున్నట్లు- మేకర్స్ సోషల్ మీడియాలో తెలిపారు. 'రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెరుపు వేగంతో పనులు దూసుకుపోతున్నాయి. ఈ వేసవికి అద్భుతమైన సినిమాను ప్రేక్షకులకు అందిస్తాము. మే 9న హరిహర వీరమల్లు బిగ్ స్క్రీన్‌లలో విడుదల అవుతుంది. మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభూతికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండండి' అని మేకర్స్ ట్వీట్ చేశారు. పవన్‌కు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఈ పోస్టుతో నెట్టింట రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారు. హరిహర వీరమల్లు సినిమా రెండు భాగాలుగా రానుంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటించారు. అనుపమ్ ఖేర్, బాబీ దేవోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవన్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉండడంతో ఈ సినిమా షూటింగ్ లేట్ అయింది. ముందుగా మార్చి 28న విడుదల చేయాలని భావించినా.. మే 9కు వాయిదా వేశారు.

# విశ్వంభర రామరామ పాట ప్రోమో విడుదల

చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.





# పూరి,ఛార్మిల సినిమాలో టబూ

వరుస డిజాస్టర్లతో ఇబ్బంది పడుతున్న పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతితో ఒక సినిమా తీస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాని ఛార్మి కౌర్ నిర్మాతగా నిర్మించబోతున్నారు. ఇక ఈ సినిమాకి సంబంధించి అనేక విషయాలు తెరమీదకి వస్తూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఈ సినిమాలో టబూ లేదా రవినా టాండన్, ఇద్దరిలో ఒకరు కీలక పాత్రలో నటించే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. అయితే, ఎట్టకేలకు టబూ ఫిక్స్ అయింది. ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ, పూరి జగన్నాథ్, ఛార్మితో కలిసి టబూతో ఉన్న ఒక ఫోటోని సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. పూరి జగన్నాథ్ చెప్పిన లైన్ విని సేతుపతి బాగా ఎ-క్సై-÷-సట్ అయ్యాడని, ఎప్పుడెప్పుడు సినిమా మొదలు పెడదామా అని ఎదురు చూస్తున్నాడని అంటు-న్నారు. ఇక ఈ సినిమాలో టబూ ఒక పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నట్లు-గా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాతో పూరి జగన్నాథ్ మంచి కంబ్యాక్ ఇస్తాడని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు.



# మాస్ జాతరతో వస్తోన్న రవితేజ




వరుసగా చిత్రలు ఫెయిల్ అవుతున్నా...గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ తన ఎనర్జీని ప్రూవ్ చేస్తూ మాస్ మహారాజా రవితేజ దూసుకెళ్తున్నారు. -టైగర్ నాగేశ్వరరావు, ఈగెల్ సినిమాల తర్వాత మిస్టర్ బచ్చన్ సినిమా ద్వారా ప్రేక్షకులను పలకరించిన రవితేజకు ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో మరో మాస్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో భాగంగానే భాను బోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న 'మాస్ జాతర' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. రవితేజ కెరీర్‌లో ఇది 75వ సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.సూర్యదేవర నాగవంశీతో పాటు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా మరోమారు జోడి కట్టింది. ఇద్దరి ఎనర్జీ కలిసితే స్క్రీన్ మీద పండగే అంటున్నారు ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌కి మంచి ఆదరణ ఉంది. ఇకపోతే తాజాగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ 'టూ మేరా లవర్' ను ఏప్రిల్ 14 న విడుదల చేయబోతున్నట్టు- చిత్రబృందం ప్రకటించింది. మాస్ బీట్, రవితేజ-శ్రీలీల ఎనర్జీతో ఈ సాంగ్ సంగీత ప్రియులను ఊపేస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటకు మాస్ ట్యూన్స్ స్పెషలిస్ట్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్, పోస్టర్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. అభిమానులకు ఈ 'మాస్ జాతర' పండుగలా మారనుంది.

# కొత్తగా స్కూల్‌కు వెళుతున్నట్లుగా ఉంది

## దర్శకత్వ బాధ్యతలపై హృత్రిక్ రోషన్

హీరోగా విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు స్టార్ హీరో హృతిక్ రోషన్. ఇప్పుడీ హీరో దర్శకుడిగా మారనున్న విషయం తెలిసిందే. 'క్రిష్ 4'కు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా దీనిపై ఓ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. ఎంతో భయంగా ఉందన్నారు. నాకు దర్శకత్వంపై మొదటినుంచి ఆసక్తి ఉంది. కానీ, ఇప్పుడు భయపడుతున్నాను. మళ్లీ కొత్తగా స్కూల్‌కు వెళ్తున్నట్లు అనిపిస్తుంది. ఎందుకంటే ఇది నాకు పూర్తి భిన్నమైన రంగం. దర్శకుడు అంటే ఎన్నో సవాళ్లు ఉంటాయి. ఎన్నో పరిశోధనలు చేయాలి. భవిష్యత్తులో ఎందుకు దీన్ని ఎంచుకున్నానా అని కూడా అనిపిస్తుంది. ఇలాంటివి ఎన్నో ఎదుర్కోవాలి. అన్నిటికీ సిద్ధపడే దర్శకుడిగా అడుగులు వేస్తున్నా. ఎప్పుడూ మీ ప్రేమను గుర్తుంచుకుంటానని తెలిపారు. ఇక హృతిక్ ఈ సినిమాను ప్రకటించిన నాటినుంచి దీనికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇందులో హృతిక్ త్రిపాత్రాభినయంలో కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. హీరో పాత్రతో పాటు విలన్‌గానూ కనిపించనున్నారట. బాలీవుడ్‌లోని అగ్ర నటీనటులు ఇందులో భాగం కానున్నారట. ప్రీతి జింటా, ప్రియాంక చోప్రా, వివేక్ ఒబెరాయ్, రేఖ ఇందులో నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అలాగే ఓ కీలక పాత్రలో నోరా ఫతేహి కనిపించనున్నట్లు- సమాచారం.



# నెగెటివ్ ప్రచారాలపై మండిపడ్డ త్రిష

సోషల్‌మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. వారిది విషపూరితమైన స్వభావం అని పేర్కొన్నారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్‌మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని, మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. త్రిష ఈవిధమైన పోస్టులు పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై గతంలోనూ ఆమె మండిపడ్డారు. వారి ప్రవర్తన ఏమీ బాగోలేదన్నారు. అలాంటి వారి మాటలు పట్టించుకోనని చెప్పారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ఆమె రోల్‌ను కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంతమంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు ఆమె గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు.



## గోశాల గోవుల మృతి ఆరోపణలు సత్యదూరం

● అత్య ప్రచారాలుగా కొట్టి పారేసిన టిటిడి

**తిరుమల,ఏప్రిల్11( వెలుతురు):**

గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొద్దిమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని టిటిడి ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మృతి చెందిన గోవుల ఫొటోలు అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఫొటోలు అసలు గోశాలకు సంబంధించినవి కావు, దురుద్దేశంతో కొద్ది మంది మృతి చెందిన గోవుల ఫొటోలను టిటిడి గోశాలలో మృతి చెందినవిగా చూపించి.. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్న ప్రచారం అని కొట్టిపారేసింది.. గోవుల చనిపోయా యంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించిన టిటిడి, ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.. టిటిడి ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే ఈ ప్రకటన విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం నకు చెందిన గోశాలలో గోవులు మృతిచెందాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఇక, ఈ వ్యవహారంపై టిటిడి మాజీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి.. ఆరోపణలు గుప్పించారు.. హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయం అంటున్న ఎన్డీఏ ప్రభుత్వంలో వందకు పైగా గోవులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. స్వీ గోశాలలో గత మూడు నెలలుగా వందకుపైగా ఆవులు చనిపోతున్నా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.. అయితే, ఎస్వీ గోశాలలో గోవులు మృతిచెందాయంటూ జరుగుతోన్న ప్రచారంపై స్పందించిన టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయంటూ వస్తున్న వార్తలు అవాస్తవం అని కొట్టిపారేసింది..

## భారత్,చైనా సుంకాల గొడవ

● భారత్ అప్రమత్తంగానే ఉందన్న జైశంకర్

**న్యూఢిల్లీ,ఏప్రిల్11( వెలుతురు):**



అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతుంది. దీంతో ప్రపంచం తీవ్ర గందరగోళానికి గురైతుంది. ఇక, ఈ వివాదంపై న్యూఢిల్లీలో జరిగిన కార్నెగీ ఇండియా గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ.. భారతదేశం తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉందని అన్నారు. రెండు అతి పెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పరంగా నువ్వానేనా అన్నట్లుగా సుంకాల యుద్ధం సాగుతోందన్నారు. జనవరి 20వ తేదీన డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగాఅధికారం చేపట్టిన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం వాషింగ్టన్‌తో చర్చలను వేగవంతం చేశామని కేంద్రమంత్రి జైశంకర్ అన్నారు. కానీ, ట్రంప్ తన మొదటి పదవీకాలం సమయంలో వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చక పోవడంతో ఇండో- అమెరికా వాణిజ్య విధానంపై తీవ్రమవుతున్న అనిశ్చితి నెలకొందన్నారు. కాగా, ఇప్పుడు మాత్రం ఆ ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ప్రయత్నిస్తోందని తేల్చి చెప్పారు. అయితే, ప్రస్తుతం అమెరికాలో ఆందోళనకర వాతావరణం నెలకొనడంతో.. చర్చల్లో వేగం తగ్గిపోయిందన్నారు. అయితే, యుఎస్-చైనా మధ్య సంబంధాలు చాలా భిన్నంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇక, 1947లో భారత్ కి స్వాతంత్యం÷-ర వచ్చిన తర్వాత అమెరికా- చైనా మధ్య తీవ్రమైన పోటీ- ఉండేది.. ఆ పోటీ-లో మేము చిక్కుకు పోయామన్నారు.. కాగా, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్నది వాణిజ్యం, రాజకీయం, రక్షణ సమస్య కాదు.. ఇది చాలా సున్నితమైన అంశమని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ వెల్లడించారు.

## నదిలో కుప్పకూలిన హెలికాప్టర్

● టెక్ కంపెనీ సిఇవో కుటుంబ మృత్యువాత



**న్యూయార్క్,ఏప్రిల్11( వెలుతురు):**

అమెరికాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. న్యూయార్క్‌లో ఓ పర్యటక హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ నదిలో కుప్పకూలిన ఘటనలో ఓ టెక్ కంపెనీ సీఈఓ, ఆయన కుటుంబం దుర్మరణం పాలయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జర్మనీకి చెందిన దిగ్గజ సీమెన్స్ కంపెనీ స్పెయిన్ విభాగ అధిపతి, సీఈఓ అగస్టన్ ఎస్కోబార్ తన కుటుంబంతో కలిసి న్యూయార్క్ పర్యటనకు వచ్చారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హడ్సన్ నది మీదుగా వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గింగిరాలు తిరుగుతూ నదిలో తలకిందులుగా పడిపోయింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మృతి చెందారు. వీరిలో ఎస్కోబార్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలతో పాటు పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన బెల్ 206 చాపర్‌ను న్యూయార్క్ హెలికాప్టర్ టూర్స్ విభాగం సైట్ సీయింగ్ కోసం వినియోగిస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలంలో బోట్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్ తలకిందులుగా పూర్తిగా నీళ్లలో కూరుకుపోయిందని వెల్లడించారు. గాల్లో ఉండగానే హెలికాప్టర్‌లోని ఒక భాగం విరిగిపోయిందని అధికారులు పేర్కొన్నారు.

## అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు

● సిపిఎం మద్దతు కోరిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్,ఏప్రిల్11( వెలుతురు):**

బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహ ఏర్పాటు సాధనకై అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుతో తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అందువల్ల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ మింట్ కాంపౌండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు-కు సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ మద్దతు కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తక్షణమే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలన్నారు. కుల గణన వివరాలను గ్రామ పంచాయతీల వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు- చేయాలన్న ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదన అభినందనీయమని సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కవిత పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదని తమ నమ్మకమని తెలిపారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు- చేయాల్సిందేనని అన్నారు. ఎమ్మెల్సీ కవిత డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## మంగళగిరిలో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాల

● అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు

● ఇళ్ల పట్టాల పంపిణీలో నారా లోకేశ్ వెల్లడి



**అమరావతి,ఏప్రిల్11( వెలుతురు):**

లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందని అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకుంటామని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మంగళగిరికి మంజూరైన ఆంధ్రప్రదేశ్‌లో తొలి వందపడకల ప్రభుత్వ ఆస్పత్రికి 13వ తేదీన శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండగానే మంగళగిరి కోసం సొంత ఖర్చులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే... అధికారంలో ఉండగా ఇంకెంత చేయగలనో ఆలోచించాలని అన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. మంగళగిరిలో నాల్గో రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. పేదలకు మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందజేస్తున్నారు. రత్నాల చెరువుకు చెందిన 600 మందికి, తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి నారా లోకేష్ పంపిణీ చేశారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com